
# ఆంధ్రజ్యోతి

**** ఇఫ్తార్ : 6.31 | సహర్ : 5.04 (గురువారం)

ANDHRAJYOTHY



## నల్లగొండ

5

బుధవారం 12 మార్చి 2025


**హెల్ప్‌లైన్ నంబర్లు**

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

| | |
|---|---|
| నల్లగొండ | :18004251442 |
| యాదాద్రి | :1800 425 7106 |
| సూర్యాపేట | :1800 425 1972 |

**చికెన్ ధరలు**

గుడ్డు డజన్ ధర : 60

| జిల్లా | లైవ్ | డ్రెస్ | స్కిన్‌లెస్ |
|---|---|---|---|
| యాదాద్రి | రూ.112 | 175 | 200 |
| సూర్యాపేట | రూ.125 | 180 | 210 |
| నల్లగొండ | రూ.125 | 195 | 210 |

ఉష్ణోగ్రత గరిష్ఠం 34.0 , కనిష్ఠం 20.4

# హామీలను నెరవేర్చేనా?



- పలు పథకాలకు నిధులు సాధించాలని ప్రజల వేడుకోలు
- నిధులు వచ్చినా పనులు వేగంగా పూర్తిచేయాలని విన్నపం
- అన్ని హామీలకు ఈ ఏడాది నిధులివ్వాలని డిమాండ్లు
- నేటి నుంచి శాసనసభ బడ్జెట్ సమావేశాలు



శాసనసభ బడ్జెట్ సమావేశాలు బుధవారం ప్రారంభంకానున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వంలో కీలకంగా ఉన్న మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఎమ్మెల్యేలు ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తుండగా, ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చేలా ఈ బడ్జెట్‌లో పథకాలు, నిధులు మంజూరు చేయిస్తారని ఉమ్మడి జిల్లా ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు. సాధారణ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన స్థానిక హామీలకు కార్యరూపం ఇవ్వాలని కోరుతున్నారు. బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో గత ఎన్నికల సందర్భంగా అభ్యర్థులుగా ఉన్న ప్రస్తుత ఎమ్మెల్యేలు ఇచ్చిన ప్రధాన హామీలపై ప్రత్యేక కథనం..

- (ఆంధ్రజ్యోతి ప్రతినిధి,నల్లగొండ)

### నల్లగొండ నియోజకవర్గం



- నల్లగొండ పట్టణంలో బైపాస్‌రోడ్డు, లతీఫ్ సాబ్ గుట్ట, బ్రహ్మంగారి గుట్టపైకి వేర్వేరుగా ఘాట్ రోడ్ల నిర్మాణాలకు సంబంధించి ఇచ్చిన హామీ అమలు కోసం ఇప్పటికే నిధుల కేటాయింపు జరిగింది. ఈ పనులను వేగవంతం చేయాల్సి ఉంది.
- పానుగోడు చెరువుకు మంజూరైన ఎత్తిపోతల పథకాన్ని త్వరగా పూర్తిచేయాలని రైతులు కోరుతున్నారు.
- తిప్పర్తి మండల కేంద్రంలో పార్కు ఏర్పాటు చేయాల్సి ఉంది.
- నకిరేకల్-పర్సూరు-నల్లగొండ డబుల్ రోడ్డు నిర్మాణం చేపట్టాల్సి ఉంది.
- నిర్మాణంలో ఉన్న ఏటీసీ సెంటర్ పనులు వేగంగా పూర్తిచేయాల్సి ఉంది.


### నకిరేకల్ నియోజకవర్గం

- అమ్మనబోలు, వెలిమినేడు మండలాల ఏర్పాటు డిమాండ్ ఉంది.
- రామన్నపేట ఏరియా ఆస్పత్రి 100పడకలకు అప్‌గ్రేడ్‌కు ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.
- నకిరేకల్‌లో పలు పరిశ్రమల ఏర్పాటు, వీటి ద్వారా యువతకు ఉపాధి కల్పించాలని యువకులు కోరుతున్నారు.
- పోటీపరీక్షల నిమిత్తం విద్యార్థులకు ఉచిత కోచింగ్ సెంటర్ల ఏర్పాటు చేయాల్సి ఉంది.



ఎస్ ఎల్‌బీసీ సొరంగమార్గం పూర్తి చేసి ఉమ్మడి జిల్లాకు సాగు, తాగునీరందించే ఎస్ఎల్‌బీసీ పథకానికి గత బడ్జెట్‌లోనూ భారీగా నిధులివ్వడంతో పాటు 2019 నుంచి నిలిచిన పనులను ఇటీవలే ప్రారంభించారు. అయితే టన్నెల్ పనుల్లో ప్రమాదం నెలకొనడంతో ప్రస్తుతం పనులు నిలిచినా, త్వరలో ప్రారంభిస్తామని మంత్రులు ప్రకటించారు. ఏఎమ్మార్పీ కింద ప్రధాన కాల్వను విస్తరించి/లైనింగ్ చేపట్టాలని రైతులు కోరుతున్నారు. ఈ ప్రాజెక్టులో భాగమైన బ్రాహ్మణవెల్లంల ఎత్తిపోతల పనులు...

- మిగతా 7వ పేజీలో...



### మునుగోడు నియోజకవర్గం



- శేషిలేటి ఫీడర్ ఛానల్, వెల్మకన్నె ఫీడర్ ఛానల్ పనులు పూర్తిచేయాలని రైతులు కోరుతున్నారు.
- మునుగోడు మండల కేంద్రంలో డిగ్రీ, జూనియర్ కళాశాల ఏర్పాటు, చౌటుప్పల్‌లో డిగ్రీ, ఐటీఐ కళాశాల ఏర్పాటు చేయాలనే డిమాండ్ ఉంది.
- మునుగోడు పీహెచ్‌సీని 100 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్‌కు హామీ ఇచ్చారు.
- నియోజకవర్గవ్యాప్తంగా ఉన్న కంపెనీల్లో స్థానికులకు ఉపాధి కల్పించే అంశంపై చర్యలు తీసుకోవాల్సి ఉంది.
- రాచకొండ గుట్టల్లో సాగుచేసుకుంటున్న రైతులకు పట్టాలిప్పిస్తామనే హామీ నెరవేర్చాల్సి ఉంది.

### దేవరకొండ నియోజకవర్గం..

- ఎస్ఎల్‌బీసీ, డిండి, పెండ్లిపాకల రిజర్వాయర్లు పూర్తిచేయాల్సి ఉంది.
- పీఏపల్లి, చందంపేట మండలాల్లో గుట్టల్లో ఉన్న ప్రాంతాలకు ఎత్తిపోతల పథకాల ద్వారా నీరందించాలని స్థానికులు కోరుతున్నారు.
- దేవరకొండ ఖిల్లా, దేవరచర్ల శివాలయాలను, పెద్దమునిగల్ ప్రాంతాలను పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేయాలనే డిమాండ్ ఉంది.
- దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రిని 200 పడకలకు అప్‌గ్రేడ్ చేయించాల్సి ఉంది.



### మిర్యాలగూడ నియోజకవర్గం

- నియోజకవర్గంలో మహిళా డిగ్రీ కాలేజీ ఏర్పాటు డిమాండ్ ఎప్పటినుంచో ఉంది.
- నిర్మాణంలో ఉన్న నాలుగు ఎత్తిపోతల పథకాల పూర్తికి చర్యలు తీసుకోవాలని రైతులు వేడుకుంటున్నారు.
- పట్టణానికి నలువైపులా నాలుగు వెహికల్ అండర్‌పాస్‌ల ఏర్పాటు పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.
- నియోజకవర్గంలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటుకు యువత ఎదురుచూస్తోంది.
- గ్రామీణ రోడ్ల నిర్మాణాలకు నిధుల మంజూరు చేయాలని ప్రజలు వేడుకుంటున్నారు.



### నాగార్జునసాగర్ నియోజకవర్గం..

- హాలియాలో 30 పడకల ఆస్పత్రి ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.
- నిడమనూరులో స్టేడియం నిర్మాణం చేపట్టాల్సి ఉంది.
- నెల్లికల్లు ఎత్తిపోతల పథకాన్ని దశలవారీగా పూర్తిచేయాలని రైతులు కోరుతున్నారు.
- తిరుమలగిరి సాగర్ మండలంలో పోడు భూములు సాగు చేస్తున్న రైతులకు పట్టాలు ఇవ్వాలనే డిమాండ్ ఏళ్లుగా ఉంది.




# పెద్దల సభలో పెరిగిన ప్రాతినిధ్యం

- మండలి చైర్మన్‌గా గుత్తా సుఖేందర్‌రెడ్డి
- కొత్తగా మరో నలుగురికి ఛాన్స్
- వీరి ఎన్నిక ఏకగ్రీవమైనట్లే
- 13న అధికారిక ప్రకటన

**శాసనమండలిలో ఉమ్మడి జిల్లాకు ప్రాతినిధ్యం పెరిగింది. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీలు గా తాజాగా నలుగురికి ఒకే సమయంలో అవకాశం దక్కడంతో ఉమ్మడి జిల్లాలో ఎమ్మెల్సీల సంఖ్య ఏడుకు చేరనుంది. కొత్తగా సభ్యుల ఎన్నికను ఈనెల 13న అధికారికంగా ప్రకటించనుండగా, వీరి పదవీ కాలం ఈనెల 30నుంచి ప్రారంభమవుతుంది.**

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి ,నల్లగొండ)

శాసనమండలిలో ఉమ్మడి జిల్లా నుంచి ఇప్పటికే మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, పట్టభద్రుల ఎమ్మెల్సీగా తీన్మార్ మల్లన్న,స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా మంకెన కోటిరెడ్డి ఉన్నారు. తాజాగా, ఎన్నికయ్యే డాక్టర్ అద్దంకి దయాకర్ (కాంగ్రెస్), కేతావత్ శంకర్‌నాయక్ (కాంగ్రెస్), నెల్లికంటి సత్యం (సీపీఐ),దాసోజు శ్రవణ్‌కుమార్ (బీఆర్ఎస్)తో కలిపి ఈ సంఖ్య ఏడుకు చేరనుంది. ఉమ్మడి రాష్ట్రంలో శాసనమండలి పునరుద్ధరణ తర్వాత ఈ స్థాయిలో ప్రాతినిధ్యం దక్కడం ఇదే తొలిసారి. గతంలో ఉమ్మడి జిల్లా నుంచి ఒకే సందర్భంలో ఇద్దరు, ముగ్గురికి మించి ప్రాతినిధ్యం దక్కలేదు. తాజాగా, రాష్ట్ర ప్రభుత్వంలో ఉమ్మడి జిల్లా పట్టుకొనసాగుతున్న నేపథ్యంలో అనూహ్యంగా మండలిలో జిల్లా నుంచి ఒకేసారి నలుగురికి అవకాశం ఇప్పించుకోవడం ద్వారా ఉమ్మడి జిల్లా నేతలు పైచేయి సాధించారు. అటు అసెంబ్లీలో, ఇటు మండలిలో కీలకనేతలు ప్రాతినిధ్యం వహిస్తున్న నేపథ్యంలో జిల్లాకు అదే స్థాయిలో నిధులు సాధిస్తారని, అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ సారించి ముందుకు నడిపిస్తారని ఉమ్మడి జిల్లా వాసులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

#### ఎమ్మెల్యే కోటా నుంచే ఐదుగురికి చాన్స్

ఉమ్మడి జిల్లా నుంచి శాసనమండలిలో ప్రాతినిధ్యం వహిస్తున్న ఏడుగురిలో ఐదుగురు ఎమ్మెల్యే కోటా నుంచే ఎన్నికయ్యారు. మండలి చైర్మన్‌గా వ్యవహరిస్తున్న గుత్తా సుఖేందర్‌రెడ్డి 2019, ఆగస్టు 19న మొదటిసారి, 2021 నవంబరు 22న రెండోసారి ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. 2019 సెప్టెంబరు 11 నుంచి మండలి చైర్మన్‌గా ఆయన కొనసాగుతున్నారు. స్థానిక సంస్థల కోటా నుంచి ఎమ్మెల్సీగా గెలిచిన మంకెన కోటిరెడ్డి (బీఆర్ఎస్) 2022 జనవరి....

- మిగతా 7వ పేజీలో...

## • యాదగిరీశుడి బ్రహ్మోత్సవాలు పరిసమాప్తం



యాదగిరీశుడి బ్రహ్మోత్సవాల ముగింపులో భాగంగా పూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకులు, పాల్గొన్న ఆలయ ఈవో భాస్కర్‌రావు

• 7లో..

# ఎస్సీ, ఎస్టీలపై దాడులను నివారించాలి

- ప్రతీ నెల పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించాలి
- రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

నల్లగొండ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): షెడ్యూల్డ్ కులాలు, తెగలపై దాడులు నివారించాలని, అంటరానితనాన్ని అరికట్టేందుకు ప్రతీ నెల చివరి వారంలో పౌరహక్కుల దినోత్సవాన్ని తప్పనిసరిగా నిర్వహించాలని, ప్రతీ మూడు నెలలకోసారి జిల్లా స్థాయి ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేయాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీల భూములకు సంబంధించి తొమ్మిది కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, వీటిపై ఈ నెల 31లోగా నివేదిక అందజేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠిని ఆదేశించారు. అలాగే ఎస్సీ, ఎస్టీలపై దాడులకు సంబంధించి 17 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, వీటి నివేదికలు పంపించాలని ఎస్పీని ఆదేశించగా, ఎస్పీ శరత్‌చంద్ర పవర్ మాట్లాడుతూ, 12 కేసులకు ఇదివరకు నివేదికలు పంపించామని, ఐదు కేసులకు సంబంధించి నివేదికలు పెండింగ్‌లో ఉన్నాయని, కమిషన్ ఆదేశాల మేరకు నిర్దేశించిన సమయంలో నివేదికలు పంపిస్తామన్నారు. 37 కేసుల్లో చార్జిషీట్ ఇంకా దాఖలు చేయలేదని, సకాలంలో దాఖలు చేయకపోతే లబ్ధిదారులు నష్టపోవాల్సి వస్తుందని, వెంటనే చార్జిషీట్ దాఖలు చేయాలని చైర్మన్ ఆదేశించారు. పరిహారం ఇచ్చే విషయంలో ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తెస్తే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో దేవాలయ ప్రవేశం, అంటరానితనం, ఎస్సీ, ఎస్టీలపై దాడుల నివారణకు ప్రతీ నెల చివర పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించాలన్నారు. అందుకు ఎస్ఐలు, తహసీల్దార్లు సంవత్సరానికి సంబంధించి కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలన్నారు. అలాగే జిల్లాస్థాయి విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశాలు నిర్వహించాలని, దీనికి సంబంధించిన సమాచారం వారం రోజుల ముందే కమిషన్ దృష్టికి తీసుకువస్తే తానుగానీ, ఇతర సభ్యులుగానీ హాజరవుతారని తెలిపారు. ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీల ఏర్పాటులో ఎస్సీ, ఎస్టీలను ప్రోత్సహించాలని, సబ్ ప్లాన్ అమలు విషయంలో ఎవరైనా లక్ష్మణ రేఖ దాటితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎంపీ నిధులు, సీడీపీ తదితర అన్ని నిధుల్లో వాటా తప్పనిసరిగా అందేలా చూడాలన్నారు. ఉపాధి హామీ నిధులు కూడా ఎస్సీ, ఎస్టీలకు వినియోగించాలని, ఈ నెల 31లోగా ఉపాధి హామీ పనులకు సంబంధించిన పనులను వేగవంతం చేయాలన్నారు. పదోన్నతుల విషయంలో రూల్ ఆఫ్ రిజర్వేషన్ తప్పనిసరిగా అమలు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో కమిషన్ సభ్యులు కుస్రం నీలాదేవి, రాంబాబు నాయక్, కొంకతి లక్ష్మీనారాయణ, జిల్లా శంకర్, జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి సంక్షేమ ఇన్‌చార్జి అధికారి, పరిశ్రమలశాఖ మేనేజర్ కోటేశ్వరరావు, గిరిజన సంక్షేమాధికారి, గృహ నిర్మాణశాఖ పీడీ రాజ్‌కుమార్, ఇన్‌చార్జి డీఆర్‌వో అశోక్‌రెడ్డి, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్, దేవరకొండ ఏఎస్పీ మౌనిక, ఎస్సీ, ఎస్టీ కోర్టు అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ అఖిల తదితరులు పాల్గొన్నారు. ప్రణయ్ హత్య కేసులో వాదనలను వినిపించి నిందితులకు శిక్షపడేలా చేసిన న్యాయమూర్తి దర్శనం నర్సింహను ఈ సందర్భంగా చైర్మన్, సభ్యులు సన్మానించారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, చిత్రంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్

# పెండింగ్ కేసులు పరిష్కరించాలి




సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

- అక్రమ కార్యకలాపాలపై దృష్టి సారించాలి
- ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ క్రైం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న కేసులను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీ శరత్ చంద్ర పవార్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన నెలవారీ నేర సమీక్షలో ఆయన మాట్లాడారు. పెండింగ్ కేసుల సంఖ్యను తగ్గించేందుకు ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతీ కేసు విచారణ పారదర్శకంగా ఉండాలన్నారు. కేసు నమోదు నుంచి చార్జిషీట్ వరకూ ప్రతి విషయాన్ని కూలంకషంగా పరిశోధన చేయాలన్నారు. అవసరమైతే సంబంధిత న్యాయమూర్తులను స్వయంగా కలిసి కేసుల పరిష్కారానికి మరింత చొరవ చూపాలన్నారు. పెండింగ్ కేసులపై నిరంతర పర్యవేక్షణ ఉంటుందన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుంటూ సమర్థ సేవలు అందజేయాలన్నారు. కమ్యూనిటీ పోలీసింగ్ ద్వారా గ్రామాల్లో సీసీటీవీ కెమెరాల ఏర్పాటుకు కృషి చేయాలన్నారు. సీసీ కెమెరాల ప్రాధాన్యాన్ని ప్రజలకు వివరించి స్వచ్ఛందంగా ఏర్పాటు చేసేలా ప్రోత్సహించాలన్నారు. వివిధ రకాల ఆన్‌లైన్ మోసాల నేపథ్యంలో డయల్ 100 వినియోగంపై విద్యార్థులు, ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతీ రోజూ డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించాలని సూచించారు. దొంగతనాలు జరగకుండా పెట్రోలింగ్ పెంచాలని, పాత నేరస్థుల కదలికలపై నిఘా పెట్టాలన్నారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం తాగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలు, గంజాయి, జూదం, ఇసుక, పీడీఎస్ రైస్ రవాణాపై ప్రత్యేక దృష్టి సారించి అరికట్టాలన్నారు. సమావేశంలో ఏఎస్పీ మౌనిక, ఎస్‌బీ డీఎస్పీ రమేష్, డీటీసీ డీఎస్పీ విఠల్‌రెడ్డి, డీఎస్పీలు కొలను శివరాంరెడ్డి, రాజశేఖరరాజు, డీసీఆర్‌డీ డీఎస్పీ సైదా, పాల్గొన్నారు.

# సాగునీటికి ఎలాంటి ఇబ్బంది లేదు

- రైతులు ఆందోళన చెందవద్దు
- కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రాజెక్టుల కింద సాగు చేస్తున్న పంటలకు సాగునీరు అందించడంలో ఎలాంటి ఇబ్బంది లేదని, ఈ విషయంలో రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కలెక్టర్ ఇలా త్రిపాఠి స్పష్టం చేశారు. బుధవారం పానగల్ సమీపంలోని ఉదయ సముద్రం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌ను ఇరిగేషన్, రెవెన్యూ, వ్యవసాయశాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యాసంగిలో సాగులో ఉన్న పంటలకు సాగునీరు అందడం లేదని వస్తున్న దుష్ప్రచారాలను నమ్మవద్దని, రైతులను తప్పుదోవ పట్టించేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు, ఉదయ సముద్రం ప్రాజెక్టుల కింద ప్రస్తుతం సాగులో ఉన్న పంటలకు ఎలాంటి నీటి కొరతలేదని ఆమె స్పష్టం చేశారు. ఉదయ సముద్రం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో 1.5టీఎంసీల నీటికి 0.86 టీఎంసీల నీటిని విడుదల చేస్తామని, ప్రాజెక్టు కింద ఉన్న 6,700 ఎకరాలకు వారబంధీ విధానంలో పంట కోత వచ్చేవరకు నీటిని అందిస్తామన్నారు. ఉదయసముద్రం డీ-40 కింద ఉన్న 11-ఎల్ డిస్ట్రిబ్యూటరీ కెనాల్‌ను కలెక్టర్ పరిశీలించి మాట్లాడుతూ 11-ఎల్ కింద ఉన్న మామిడాల, సర్వారం, ఇందుగుల, గోరింకలపల్లి గ్రామాలన్నింటికీ వారబంధీ ద్వారా నీరు అందుతోందన్నారు. ఆయకట్టు చివరి భూములకు సైతం సాగునీరు అందిస్తామన్నారు. ఫిబ్రవరి నుంచి ఎండలు తీవ్రమైన దృష్ట్యా కొంతవరకు ప్రాజెక్టుల్లో నీరు తగ్గిన మాట వాస్తవమని, అయితే ఉదయసముద్రంకు సాగునీటిని విడుదల చేసిన తర్వాత 30శాతం భూగర్భ జలాలు పెరిగాయన్నారు. అన్ని మండల వ్యవసాయాధికారుల కార్యాలయాల్లో ఫిర్యాదుల విభాగాలను ఏర్పాటు చేశామని, ఏవైనా సమస్యలు ఏర్పడితే ఫిర్యాదు చేయాలన్నారు. తక్షణమే సం బంధిత శాఖల అధికారులు వాటిని పరిష్కరిస్తారన్నారు. నకిరేకల్, మునుగోడు, నల్లగొండ నియోజకవర్గాల్లో కాల్వల కింద సాగు చేసే భూములకు ఎలాంటి నీటి కొరతలేదని, 10రోజుల్లో ఇక్కడ కోతలు కూడా పూర్తవుతాయన్నారు. దేవరకొండ, మిర్యాలగూడలో వేరుశనగ పంటలు ఆలస్యంగా సాగు చేశారని, అక్కడ కూడా పంటలు ఎండిపోకుండా తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఆమె వెంట జిల్లా వ్యవసాయాధికారి శ్రవణ్, ఈఈ శ్రీనివాస్‌రెడ్డి, ఉన్నారు.



అధికారులతో కలిసి ఉదయసముద్రం ప్రాజెక్టును పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

## ఉమ్మడి జిల్లాలో పలువురు సీఐల బదిలీ

నల్లగొండ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో పలువురు సీఐలను బదిలీ చేస్తూ మల్టీజోన్-2 ఐజీ వి.సత్యనారాయణ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. మహబూబ్‌నగర్ జిల్లాలో పోస్టింగ్ కోసం వెయిటింగ్‌లో ఉన్న కే.ఆదిరెడ్డిని నల్లగొండ జిల్లా నాంపల్లి సీఐగా నియమించారు. నాంపల్లిలో పనిచేస్తున్న అనంతు నవీన్‌కుమార్‌ను హైదరాబాద్ సిటీ కమిషనరేట్‌కు బదిలీ చేశారు. నల్లగొండ ట్రాఫిక్ సీఐగా ఉన్న డి.రాజును చండూరు సీఐగా బదిలీ చేశారు. చండూరు సీఐగా ఇప్పటి వరకు ఉన్న ఏ.వెంకటయ్యను హైదరాబాద్ కమిషనరేట్‌కు బదిలీ చేశారు. నల్లగొండ వీసీఆర్ సీఐగా ఉన్న కె.శివశంకర్‌ను కోదాడ సీఐగా బదిలీ చేశారు. కోదాడ సీఐగా ఉన్న టి.రామును హైదరాబాద్ కమిషనరేట్‌కు బదిలీ చేశారు.

ఉపాధి హామీ పనులు కల్పించని సిబ్బందిపై

# చర్యలు తీసుకోవాలి



ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న నారీ ఐలయ్య

మునుగోడు రూరల్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో పనులు కల్పించని సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి నారీ ఐలయ్య డిమాండ్ చేశారు. మండలంలోని కల్వకుంట్లలో ఉపాధి హామీ పనులను మంగళవారం పరిశీలించారు. జిల్లావ్యాప్తంగా ఉపాధి హామీ పనులను ఎక్కువ గ్రామాల్లో కల్పించడం లేదని, వలసలు నివారించడానికి వచ్చిన ఈ చట్టాన్ని సరిగా అమలు చేయని అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలోని ఉపాధి కూలీల పైన కక్ష సాధింపు ధోరణితో వ్యవహరిస్తోందన్నారు. కొన్ని పనులే చేయాలని ప్రభుత్వం ఆంక్షలు పెట్టడం సరికాదన్నారు. కూలీలు అడిగిన పనులు కల్పించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ప్రతి కుటుంబానికి 200రోజులు పని దినాలు కల్పించి పెరుగుతున్న ధరలకు అనుగుణంగా రూ.800ల కూలి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర నాయకుడు బండా శ్రీశైలం, ఫీల్డ్ అసిస్టెంట్ పరమేష్, నాయకులు సింగపంగా ఎల్లయ్య, కట్టా ఎల్లమ్మ, పగిళ్ల మల్లేష్, సింగపంగా సుగుణమ్మ, చిలుకూరి చిన్న యాదమ్మ, చేకూరి కావ్య, పులకరం కనకమ్మ పాల్గొన్నారు.



# నిఘా నేత్రం

## పనిచేస్తేనే ఫలితం

నేరాల పరిష్కారంలో కీలకంగా సీసీ కెమెరాలు
ఆధారాల సేకరణ, నేర నిరూపణకు సీసీ ఫుటేజీలు
నగరంలో ప్రధాన రహదారులు, కూడళ్లలో ఏర్పాటు ► కొన్నిచోట్ల పని చేయని వైనం

నేరాల నియంత్రణ, పరిష్కారంలో సీసీ కెమెరాలు కీలకపాత్ర పోషిస్తున్నాయి. దొంగతనాలు, చోరీలు, చట్టవ్యతిరేక కార్యకలాపాలు, ప్రమాదాలు ఇతరత్రా నేరాల అదుపుతో పాటు ఘటన జరిగిన తీరును గమనించేందుకు సీసీ కెమెరాలు ఎంతగానో దోహదపడుతున్నాయి. నల్లగొండ జిల్లా వ్యాప్తంగా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో సీసీ కెమెరాలను ఏర్పాటుచేశారు. జిల్లాలో ఎక్కడ ఏ నేరం జరిగినా ఆ ప్రాంతంలోని సీసీ కెమెరాల ఫుటేజీలను సేకరించడంలో పోలీసులు నిమగ్నమవుతున్నారు. అయితే పలుచోట్ల అవి పనిచేయడం లేదు. దీంతో కొన్ని కేసుల పరిష్కారం జటిలంగా మారుతోంది. ఆధారాల సేకరణ, నేర నిరూపణలో సీసీ టీవీ ఆధారాలు కీలకంగా మారుతున్నట్లు పోలీస్‌వర్గాల సమాచారం.

\- (ఆంధ్రజ్యోతి-నల్లగొండ క్రైం)

తమను ఎవరూ చూడలేదని, నేరం చేసి అక్కడి నుంచి తప్పించుకుంటున్న సందర్భంలో సీసీ కెమెరాలకు చిక్కుతూ పోలీసులకు నేరస్థులు దొరికిపోతున్నారు. నల్లగొండ జిల్లావ్యాప్తంగా పోలీస్ శాఖ, కమ్యూనిటీ పోలీసింగ్ ద్వారా సీసీ కెమెరాలను ఏర్పాటుచేయిస్తోంది. అలా ఏర్పాటుచేసిన సీసీ కెమెరాల ను కమాండ్ కంట్రోల్ రూంకు అనుసంధానం చేసి జిల్లా పోలీస్ కార్యాలయ సిబ్బంది నిరంతర పర్యవేక్షిస్తున్నారు. జిల్లాలో మొత్తం కమ్యూనిటీ పోలీసింగ్ ద్వారా 2,538 సీసీ కెమెరాలు ఏర్పాటుచేయగా అందులో 1,660 పనిచేస్తుండగా 878 మరమ్మతులకు గురయ్యాయి. అదేవిధంగా షాపింగ్‌మాల్స్, అపార్ట్‌మెంట్లు, ప్రధాన కాలనీలు, షాపులు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో పాటు 'నేనుసైతం' కార్యక్రమం ద్వారా 4,483 సీసీ కెమెరాలను ఏర్పాటుచేశారు.

● ఏడాది క్రితం నల్లగొండ మండలం పెద్దసూరారం గ్రామంలో మధ్యాహ్నం ఓ ఇంట్లో చోరీ జరిగింది. సుమారు 8 తులాల బంగారు ఆభరణాలు చోరీ అయ్యాయి. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేరు. ఈ ఘటనపై బాధితులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు రంగంలోకి దిగారు. పోలీసులకు ఎలాంటి ఆనవాళ్లు లభించలేదు. ఆ ఇంటికి సమీపంలోనే బెల్టు, కిరాణ దుకాణం వద్ద సీసీ కెమెరాలు ఉండడాన్ని గమనించిన పోలీసులు వాటిని పరిశీలించారు. ఆయా కెమెరాల్లో అనుమానితులు దుకాణంలో మద్యం సేవించడంతో పాటు చోరీ చేసిన తర్వాత కూడా ఆ సీసీ కెమెరాల వద్దకు రావడాన్ని గుర్తించారు. వారిని అదుపులోకి తీసుకుని విచారించగా చోరీ చేసింది తామేనని అంగీకరించడంతో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

### అంతర్రాష్ట్ర ముఠా ఆటకట్టు

నల్లగొండ జిల్లాలో చోరీలకు పాల్పడుతూ అమాయకులను కిరాతకంగా హత్య చేస్తున్న పార్థీ గ్యాంగ్ ముఠాను సైతం జిల్లా పోలీసులు సీసీ కెమెరాల సహకారంతో చాకచక్యంగా పట్టుకున్నారు. కట్టంగూరు మండలం పామనగుండ్ల సమీపంలో రోడ్డు పక్కన గూడ్స్ ఆటో ఆపి సేద తీరుతున్న డ్రైవర్‌ను హత్య చేసి అతడి వద్ద ఉన్న నగదును దొంగిలించి అదే మండలంలో రెండు ఇళ్లల్లో ఓ ముఠా చోరీకి పాల్పడింది. కట్టంగూరు నుంచి చిట్యాల, చౌటుప్పల్ వరకూ సీసీ కెమెరాల ఫుటేజీలను సేకరించి పోలీసులు హత్య, చోరీలకు పాల్పడుతున్న పార్థీ గ్యాంగ్‌కు చెందిన నలుగురు ముఠాగా నిర్ధారించుకుంది. వారి కదలికలను గమనించి ముఠా లీడర్ అప్పాపాండ్రంగాతో పాటు మిగతా నిందితులను అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారు.వారిని అరెస్టు చేయడంలోనూ సీసీ కెమెరాల పాత్ర ఎంతో ఉంది.

### పర్యవేక్షణ లోపంతోనే పని చేయని సీసీ కెమెరాలు..

నిరంతరం నిఘా నీడలో ఉండాల్సిన ప్రధాన నగరాల్లో సీసీ కెమెరాలు లేకపోవడం, ఉన్నా కొన్నిచోట్ల పనిచేయకపోవడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పోలీసులు సీసీ కెమెరాల ఫుటేజీలను సమకూర్చుకుని కొన్ని కేసులను ఛేదిస్తూ కీలకంగా పనిచేస్తున్నా చిన్నా, చితక, పేదవర్గాల ప్రజలకు సంబంధించిన సెల్‌ఫోన్లు, చోరీలు జరిగిన సమయంలో ఇబ్బందులు తప్పడం లేదు. కేసులను ఛేదించేందుకు సీసీ కెమెరాలు లేకపోవడంతో అమాయక ప్రజలు, పేదలు నిత్యం పోలీసుస్టేషన్ల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి నెలకొంది. జిల్లావ్యాప్తంగా ఏర్పాటుచేసిన సీసీ కెమెరాలు పర్యవేక్షణ లోపంతో పని చేయడంలేదనే ఆరోపణలు ఉన్నాయి. మరమ్మతులకు గురైన సీసీ కెమెరాలను రిపేర్ చేయించం వ్యయంతో కూడిన పనికావడంతో వాటిని అలాగే వదిలేస్తున్నారు. అయితే కొన్ని ప్రాంతాల్లో పోలీస్



స్టేషన్ ఎస్‌హెచ్‌వోలు స్వచ్ఛంద సంస్థలను, దాతలను సంప్రదించి సీసీ కెమెరాల ఉపయోగాన్ని వివరించి వారి ద్వారా మరమ్మతులు చేయిస్తున్నారు. అయితే ఇందులో పోలీస్ శాఖకు సంబంధించి ప్రత్యేకంగా సాంకేతిక సిబ్బంది లేకపోవడం కూడా మరమ్మతుల్లో అలసత్వం జరుగుతోంది. పోలీస్ శాఖ నుంచే ప్రతీ పోలీస్ స్టేషన్, సర్కిల్ పరిధిలో టెక్నికల్ సిబ్బందిని కేటాయిస్తే సీసీ కెమెరాల మరమ్మతులు సులభతరం అవుతాయంటున్నారు.

### ప్రణయ్ హత్యను ఛేదించడంలోనూ...

రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన మిర్యాలగూడకు చెందిన ప్రణయ్ పరువు హత్య కేసు మిస్టరీని ఛేదించడంలో సీసీ కెమెరాలు కీలకపాత్ర పోషించాయి. ఆసుపత్రి నుంచి బయటకు వచ్చిన ప్రణయ్‌పై వెనుక నుంచి సుభాష్‌శర్మ కత్తితో దాడి చేయడం అక్కడి సీసీ కెమెరాల్లో రికార్డయ్యింది. అంతేకాకుండా నిందితులు టోల్‌గేట్ వద్ద కారులో వెళ్తున్న దృశ్యాలు అక్కడి సీసీ కెమెరాల్లో నమోదవడంతో పోలీసులు కేసును ఛేదించడంలో సులువుగా మారింది.

### సీసీ కెమెరాలను ప్రతి చోటా ఏర్పాటు చేసుకోవాలి



నల్లగొండ జిల్లా వ్యాప్తంగా ప్రజలు, నాయకులు, యువకుల సహకారంతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలి. సీసీ కెమెరాలను ఏర్పాటుతో నేరాలు జరిగిన సమయంలో నిందితులను గుర్తించే అవకాశం ఉంటుంది. సీసీ కెమెరాలు ఉన్నాయనే భయంతో నేరాలు చేసే వారు భయపడే అవకాశం ఉంది. నల్లగొండ జిల్లావ్యాప్తంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో 1,660 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశాం. జిల్లా కేంద్రంలో ఇటీవల చర్లపల్లి బైపాస్ నుంచి కలెక్టరేట్‌తో పాటు కొన్ని ప్రాంతాల్లో అధునాతన కెమెరాలను ఏర్పాటు చేశాం. ఎక్కడైనా సీసీ కెమెరాలు పనిచేయకుంటే గుర్తించి మరమ్మతు చేయిస్తాం. ప్రజలు, వ్యాపారస్తులు కూడా ముందుకు వచ్చి సహకారం అందించాలి. నేను సైతం ద్వారా కూడా పెద్దసంఖ్యలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నాం.

\-శరత్‌చంద్ర పవార్, నల్లగొండ జిల్లా ఎస్పీ

### రహదారుల విస్తరణతో...

నల్లగొండ జిల్లా కేంద్రంలోని బస్టాండ్‌తో పాటు మిర్యాలగూడ, దేవరకొండ, నకిరేకల్, నార్కట్‌పల్లి ఇతర ప్రాంతాల్లో ఏర్పాటుచేసిన కొన్ని సీసీ కెమెరాలు పనిచేయడంలేదు. దీంతో ఆయా ప్రాంతాల్లో సెల్‌ఫోన్, బైక్ చోరీలు, ఇతర నేరాలు జరిగిన సమయంలో సీసీ కెమెరాలను పరిశీలించి, నిందితులను గుర్తించడం పోలీసులకు కత్తిమీది సాములాగానే మారింది. జిల్లా కేంద్రంలో రోడ్ల మరమ్మతులు, రోడ్ల విస్తరణ సమయంలో



సీసీ కెమెరాలను తొలగించి పనులుచేశారు. ఆ విస్తరణ పనులు మధ్యలోనే నిలిచిపోవడం వంటి కారణాలతో సీసీ కెమెరాలను బిగించలేదు. దీంతో ప్రమాదాలు, నేరాలు జరిగినా దుకాణాల వద్ద ఏర్పాటుచేసిన సీసీ కెమెరాల యజమానులను పోలీసులు సంప్రదించాల్సిన దుస్థితి ఏర్పడింది.

# హడలెత్తించిన దొంగలు దొరికారు

**సూర్యాపేట జిల్లాలో ఒకే రోజు మూడు మండలాల్లో నాలుగు గంటల వ్యవధిలో ఐదు చోట్ల దొంగతనాలకు పాల్పడి హల్‌చల్‌చేసిన దొంగలు ఎట్టకేలకు దొరికారు. వాహన తనిఖీల్లో భాగంగా గరిడేపల్లి పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి రూ.3.5 లక్షల సొత్తు, రూ.87 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు.**



దొంగలతో పాటు వారి నుంచి స్వాధీనం చేసుకున్న సొత్తును చూపుతున్న ఎస్పీ నర్సింహ, ఏఎస్పీ నాగేశ్వరావు

సూర్యాపేటక్రైం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : తాళం వేసి ఉన్న నివాసాలను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగలను సూర్యాపేట జిల్లా గరిడేపల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.3.50లక్షల విలువైన సుమారు ఏడున్నర తులాలబంగారు ఆభరణాలు, రూ.87వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. కేసుకు సంబంధించిన వివరాలను మంగళవారం ఎస్పీ కొత్తపల్లి నర్సింహ జిల్లా పోలీస్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటూరు పట్టణానికి చెందిన టైల్స్ వర్క్ చేసే చిల్లర సురేష్, విజయవాడలోని ఇబ్రహీంపట్నం ప్రాంతానికి చెందిన సుతారీ మేస్త్రీ బత్తుల రాజు కలిసి తాళం వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడుతుంటారు. ఫిబ్రవరి 21వ తేదీన గరిడేపల్లి, నేరేడుచర్ల, పాలకవీడు మండలాల పరిధిలోని పలు నివాసాల్లో చోరీలకు పాల్పడ్డారు. ఆయా ఇళ్లలోని బీరువాల్లో భద్రపరిచిన నగదుతో పాటు బంగారు ఆభరణాలను చోరీచేశారు. గరిడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో మూడు కేసులు, నేరేడుచర్ల పరిధిలో ఒక కేసు, పాలకవీడు పరిధిలో రెండు కేసులు నమోదయ్యాయి. ఆయా కేసులకు ఎస్‌ఐలు దర్యాప్తు చేపట్టారు. ఇదిలా ఉండగా ఈ నెల 11న తెల్లవారుజామున మూడు గంటల సమయంలో సురేష్, రాజు ఇద్దరు ఒక బైక్‌పై సూర్యాపేటకు వెళ్తున్నారు. ఆ సమయంలో గరిడేపల్లి మండలంలోని పొనుగోడు క్రాస్‌రోడ్డు వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ నరేష్ వారిని ఆపి విచారించారు. వారి నుంచి సరైన సమాధానం రాలేదు. అంతేకాకుండా వారి వద్ద ఉన్న బ్యాగ్‌ను తనిఖీచేయగా బంగారు ఆభరణాలు కనిపించాయి. వాటి గురించి ఆరా తీయగా సమాధానం చెప్పకపోవడంతో ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారించారు. ఫిబ్రవరిలో గరిడేపల్లి, నేరేడుచర్ల, పాలకీడు మండలాల పరిధిలో చోరీలకు పాల్పడినట్లు, చోరీ చేసిన బంగారు ఆభరణాల్లో కొన్నింటిని గుంటూరు పట్టణానికి చెందిన ప్లంబింగ్ పని చేసే చింత నాగేశ్వర్‌రావు వద్ద భద్రపరిచినట్లు, మిగిలిన బంగారు ఆభరణాలను సూర్యాపేటలో విక్రయించేందుకు వెళ్తున్నట్లు తెలిపారు. వెంటనే గుంటూరుకు వెళ్లి నాగేశ్వర్‌రావును అదుపులోకి తీసుకుని అతడి వద్ద ఉన్న, సురేష్, రాజు వద్ద ఉన్న మొత్తం 7.3తులాల బంగారు ఆభరణాలు, రూ.87వేల నగదు, చోరీలకు ఉపయోగించే ఇనుపరాడ్లు, బైక్‌ను స్వాధీనం చేసుకుని ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

### తెలుగు రాష్ట్రాల్లో 64 కేసుల్లో నిందితుడు

ప్రధాన నిందితుడైన సురేష్‌పై తెలుగు రాష్ట్రాల్లోని పలు జిల్లాల్లో 64 కేసులు ఉన్నాయని ఎస్పీ నర్సింహ తెలిపారు. కాగా గుంటూరు జిల్లా లాలాపేట్, కొత్తపేట పోలీస్ స్టేషన్ల పరిధిలో నమోదైన కేసుల్లో జైలుకు వెళ్లి బెయిల్‌పై బయటకువచ్చి సూర్యాపేట జిల్లాలో చోరీలకు పాల్పడినట్లు వివరించారు. అదేవిధంగా ఏపీలోని పలు పోలీస్‌స్టేషన్ల పరిధిలో 9కేసులు ఉన్నాయన్నారు. అంతర్రాష్ట్ర దొంగలను పట్టుకున్న పోలీసులను ఎస్పీ అభినందించారు.

### మరో కేసులో దొంగ అరెస్ట్

హుజూర్‌నగర్ పట్టణానికి చెందిన భీమిశెట్టి ప్రదీప్ ఫ్లవర్ డెకరేషన్ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. హుజూర్‌నగర్‌కు చెందిన భోజనపల్లి నాగేశ్వర్‌రావు తన కుమార్తె వివాహం నిమిత్తం పెళ్లి మండపం ఏర్పాటుచేయాలని పట్టణానికి చెందిన మహ్మద్ షబ్బుకు తెలిపాడు. అయితే షబ్బు ఆ పనికి ప్రదీప్‌ను పురమాయించాడు. అందులో భాగంగా ఈనెల 7న రాత్రి నాగేశ్వర్‌రావు నివాసంలోని రూ.1.5 లక్షల విలువైన 17 గ్రాముల బంగారు చైన్, రూ.14వేల నగదును చోరీచేశాడు. ఈ ఘటనపై నాగేశ్వర్‌రావు పోలీసులకు ఫిర్యాదుచేశాడు. కేసు విచారణలో భాగంగా ఈ నెల 11న ప్రదీప్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా చోరీ చేసింది తానేనని అంగీకరించాడు. అతడి నుంచి బంగారు చైన్, నగదును స్వాధీనం చేసుకుని కోర్టుకు రిమాండ్‌కు చేస్తున్నట్లు ఎస్పీ వెల్లడించారు. దొంగలను పట్టుకున్న పోలీసులకు ఎస్పీ రివార్డులు అందజేశారు. సమావేశంలో అదనపు ఎస్పీ మేక నాగేశ్వర్‌రావు, కోదాడ డీఎస్పీ మామిళ్ల శ్రీధర్‌రెడ్డి, హుజూర్‌నగర్ సీఐ చరమందరాజు, గరిడేపల్లి, హుజూర్‌నగర్, నేరేడుచర్ల ఎస్‌ఐలు నరేష్, ముత్తయ్య, రవీందర్‌నాయక్ సిబ్బంది రామారావు, నాగరాజు, శంభయ్య, నాగరాజు ఉన్నారు.

### ● మద్యానికి బానిసై చోరీలు

నల్లగొండ క్రైం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : మద్యానికి బానిసై చోరీలకు పాల్పడుతున్న ఓ దొంగను అరెస్టు చేసినట్లు నల్లగొండ జిల్లా కేంద్రానికి చెందిన టూటౌన్ సీఐ రాఘవరావు, ఎస్‌ఐ ఎర్ర సైదులు తెలిపారు. మంగళవారం స్థానిక టూ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో దొంగతో పాటు రికవరీ చేసిన బైక్‌లను, గ్యాస్ స్టవ్‌లను ప్రదర్శించి, మాట్లాడారు. నల్లగొండ పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన పెరిక కిరణ్ ఎంఎల్‌టీ పూర్తిచేశాడు. 2018లో వివాహం కాగా ఇద్దరు కుమారులు ఉన్నారు. కిరణ్ క్యాటరింగ్ పనిచేస్తూ భార్యాపిల్లలతో కలిసి జీవిస్తున్నాడు. ఈ క్రమంలో కిరణ్ మద్యానికి బానిసై మద్యం తాగేందుకు డబ్బులు లేకపోవడంతో బైక్‌లు చోరీ చేసి వాటిని విక్రయించి వచ్చిన డబ్బులతో జల్సాలు చేయాలని నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలో నల్లగొండ వన్‌టౌన్, టూటౌన్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో నాలుగు విలువైన బైక్‌లను, పట్టణంలోని శివాజీనగర్‌లో ఓ ఇంటి తాళాలు పగలగొట్టి ఇంట్లో ఉన్న రెండు గ్యాస్ స్టవ్‌లను చోరీ చేశాడు. సోమవారం ఉదయం పానగల్ ఫ్లైఓవర్ వద్ద వాహనాలు తనిఖీచేస్తున్న సమయంలో నల్లగొండ టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోరీ చేసిన బైక్‌పై రెండు గ్యాస్‌స్టవ్‌లను తీసుకుని వెళ్తుండగా పట్టుకుని పోలీసులు ప్రశ్నించారు. విచారణలో చోరీ చేసినట్లు కిరణ్ తెలపడంతో వాటిని స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వాటి విలువ సుమారు రూ.3లక్షల వరకూ ఉంటుందన్నారు. నల్లగొండ డీఎస్పీ పర్యవేక్షణలో నేరస్థుడిని పట్టుకున్న సీఐ రాఘవరావు, ఎస్‌ఐ ఎర్ర సైదులు, సిబ్బంది బాలకోటి, శంకర్‌లను ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అభినందించారు.

### ● సులభ సంపాదన కోసం బైక్‌ల దొంగతనం

భువనగిరి టౌన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : సులభ సంపాదన కోసం బైక్‌లను చోరీ చేస్తున్న దొంగను యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి పట్టణ పోలీసులు అరెస్ట్ చేశారు. పట్టణ ఇన్‌స్పెక్టర్ సురేష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం మంగళవారం భువనగిరి పట్టణంలోని హైదరాబాద్ చౌరస్తా వద్ద పోలీసులు తనిఖీలు చేస్తున్న క్రమంలో బైక్‌పై వెళ్తున్న తుర్కపల్లి మండల కేంద్రానికి చెందిన బండారి వెంకటేష్‌ను అదుపులోకి తీసుకొని విచారించారు. దీంతో భువనగిరిలోని సాయిబార్ వద్ద నిలిపిన బైక్‌ను ఈ నెల 10న చోరీ చేసినట్లు అంగీకరించాడు. భువనగిరి, యాదగిరిగుట్ట, బీబీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మరో మూడు బైక్‌లను, మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ పరిధిలో బైక్‌ను చోరీ చేసినట్లు తెలిపాడు. భువనగిరిలో అపహరించిన బైక్‌ను విక్రయించేందుకు హైదరాబాద్‌కు వెళ్తూ పట్టుబడ్డాడు. దీంతో నిందితుడిని అరెస్ట్ చేసి ఐదు బైక్‌లను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. స్వతహాగా డ్రైవర్ అయిన వెంకటేష్ అప్పుల పాలై సులభ సంపాదన కోసం బైక్‌లను అపహరిస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.



పట్టుబడిన దొంగ, స్వాధీనం చేసుకున్న బైకులను ప్రదర్శిస్తున్న పోలీసులు

## గడువు తీరిన ఎరువుల విక్రయాలు

● రూ.2లక్షల విలువైన ఎరువులు స్వాధీనం ● విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల సోదాలు



స్టాక్ రిజిస్టర్‌లు తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

మిర్యాలగూడ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): గడువు తీరిన ఎరువులు, పురుగుల మందులు విక్రయిస్తున్న దుకాణంపై విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సోదాలు నిర్వహించి రూ.2లక్షల విలువైన ఎరువులు స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో ఈ సంఘటన జరిగింది.పట్టణ శివారులోని నందిపాడు, రవీంద్రగర్ పురుగుల మందులు విక్రయిస్తున్న లక్ష్మీ వెంకటేశ్వర ఫర్టిలైజర్స్, మిర్యాలగూడ రైతు ఆగ్రో సేవాకేంద్రంపై ఫిర్యాదులు అందడంతో మండల వ్యవసాయ అధికారి, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖ అధికారులు మంగళవారం తనిఖీలు చేశారు. లక్ష్మీ వెంకటేశ్వర దుకాణంలో సుమారు రూ.11వేలు, ఆగ్రోసేవా కేంద్రంలో రూ.1.86లక్షల విలువైన గడువు తీరిన మందులను స్వాధీనం చేసుకున్నారు. స్టాక్ రిజిస్టర్‌లో వీటిని నమోదు చేయకపోవడంపై రెండు దుకాణాల యజమానులపై కేసులు నమోదు చేశారు. ఉదయం సమయంలో ఎరువులు కొనుగోలు చేసేందుకు వచ్చిన రైతులతో విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మాట్లాడుతూ బలవంతంగా ఎరువులు విక్రయిస్తున్నారా అంటూ ప్రశ్నించగా, తక్కువ ధరకు ఎవరు విక్రయిస్తే అక్కడే కొనుగోలు చేస్తున్నామని వారు సమాధానమిచ్చారు. తనిఖీల్లో విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ ఎస్‌కే.గౌస్, కానిస్టేబుల్ నరసింహ, ఏఈవో షఫీ, మండల వ్యవసాయ అధికారి సైదానాయక్ పాల్గొన్నారు.

## అదుపు తప్పి చెట్ల పొదల్లోకి దూసుకెళ్లిన కారు



మోత్కూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూరు మునిసిపాలిటీ పరిధిలో మోత్కూరు-గుండాల రోడ్డుపై వెళుతున్న కారు మంగళవారం సాయంత్రం అదుపు తప్పి కంపచెట్లలోకి దూసుకెళ్లింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం నల్లగొండ నుంచి జనగాం పట్టణానికి వేగంగా వెళుత్ను కారు ఏపీ 15 ఏపీ 7950 మోత్కూరులో జామచెట్లబావి క్రాస్‌రోడ్ సమీపంలో అదుపు తప్పి రోడ్డు పక్కన కంపచెట్ల పొదల్లోకి దూసుకెళ్లి కంపచెట్టును ఢీకొని ఆగింది. కారులో ఒక్కరే ఉన్నారని, అతను జనగాం జిల్లాకు చెందిన ఒగ్గు కథ కళాకారుడని తెలిసింది

## ఐదుగురు గంజాయి కొనుగోలుదారుల అరెస్ట్

సూర్యాపేట క్రైం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి):పోలీసులు వస్తుండటాన్ని గమనించి గంజాయి విక్రయించే ఇద్దరు పరారు కాగా, కొనుగోలు చేసేందుకు వచ్చిన ఐదుగురు యువకులను సూర్యాపేట జిల్లా కోదాడ పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి సుమారు 10 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కేసుకు సంబంధించిన వివరాలను మంగళవారం సూర్యాపేట జిల్లా ఎస్పీ కొత్తపల్లి నర్సింహ జిల్లా పోలీస్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కృష్ణా జిల్లా పామర్రు మండలం కనమూరు గ్రామానికి చెందిన మల్లెడ వెంకటవంశీ, అదే జిల్లా పెనమలూరు మండలం వణుకూరు గ్రామానికి చెందిన గోకులముడి ఆనంద్ కొన్నాళ్లుగా ఒడిశా రాష్ట్రంలో గంజాయిని తక్కువ ధరకు కొనుగోలు చేసి హైదరాబాద్‌లో ఎక్కువ ధరకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. అందులో భాగంగా ఈ నెల 10వ తేదీన ఒడిశా రాష్ట్రం నుంచి సుమారు 9.860 కిలోల గంజాయిని కొనుగోలు చేసి కృష్ణా జిల్లా పెనమలూరు మండలం వణుకూరు గ్రామానికి చెందిన కారు మెకానిక్ చొరగుడి తేజతో కలిసి గంజాయిని తీసుకుని విజయవాడ నుంచి హైదరాబాద్‌కు ఆర్టీసీ బస్సు ఎక్కారు. ఇదిలా ఉండగా విజయవాడ నుంచి బయలుదేరే ముందు కృష్ణా జిల్లా గుడివాడ మండల కేంద్రానికి చెందిన మైక్రో ఫైనాన్స్‌లో పనిచేసే ఉమ్మడిశెట్టి సంపత్‌కుమార్, పామర్రు మండలం కనుమూరు గ్రామానికి చెందిన ఎల్‌అండ్‌టీ కంపెనీలో పనిచేసే పాలపర్తి కృష్ణచైతన్య, విజయవాడ అర్బన్ ప్రాంతం రామలింగేశ్వరరావునగర్‌కు చెందిన ఎల్‌అండ్‌టీ కంపెనీలో పనిచేసే నాగవీరభాస్కర్‌రావు, గుడివాడ మండలం కేంద్రానికి చెందిన డిగ్రీ విద్యార్థి హేమస్ నర్సింహసాయిలకు గంజాయిని విక్రయిస్తామని చెప్పారు. అయితే వారందరినీ తెలంగాణ ప్రాంతంలోని కోదాడ పట్టణ ప్రాంతానికి రావాలని సూచించారు. ఆ మేరకు ఐదుగరు యువకులు గంజాయి కోసం కోదాడ పట్టణ శివారులోని దుర్గాపురం క్రాస్ రోడ్డు వద్ద ఉన్న మామిడితోట వద్దకు ముందే చేరుకున్నారు. కొద్దిసేపటికి గంజాయితో వెంకటవంశీ, ఆనంద్, తేజ మామిడి తోటలకు వెళ్లారు. గంజాయిని యువకులకు విక్రయిస్తుండగా సమాచారం అందుకున్న కోదాడ పట్టణ పోలీసులు దాడిచేశారు. పోలీసుల రాకను గమనించిన వెంకటవంశీ, ఆనంద్‌లు విజయవాడ నుంచి గంజాయి కోసం వచ్చిన యువకులు తెచ్చిన బైక్‌పై పరారయ్యారు. దీంతో మిగిలిన తేజ, పాలపర్తి క్రిష్ణచైతన్య, సంపత్‌కుమార్, నాగవీర భాస్కర్‌రావు, హేమస్ నర్సింహసాయి పట్టుకోవడంతో పాటు రూ.లక్ష విలువ చేసే 9.860 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. విక్రయదారులు, కొనుగోలుదారులపై కేసులు నమోదు చేసినట్లు ఎస్పీ తెలిపారు. పోలీసులకు చిక్కిన ఐదుగురిని కోర్టుకు రిమాండ్‌కు పంపుతున్నట్లు ఎస్పీ తెలిపారు. పరారీలో ఉన్న వెంకటవంశీ, ఆనంద్‌లను త్వరలో పట్టుకుంటామన్నారు. అదేవిధంగా వెంకటవంశీపై కృష్ణా జిల్లాలోని పలు పోలీస్‌స్టేషన్లు, విజయవాడ సిటీలో పలు చోరీ కేసులు, గంజాయి కేసులు గతంలో నమోదైనట్లు సమాచారమన్నారు. గంజాయిని తరలిస్తున్న యువకులను పట్టుకున్న కోదాడ పట్టణ పోలీసులను ఎస్పీ అభినందించారు.

### సూర్యాపేటలో డీఅడిక్షన్ కేంద్రానికి కృషి

గంజాయిని ఎవరైనా విక్రయించినా, తాగినా ఆ సమాచారాన్ని ప్రజలు డయల్- 100 ద్వారా కానీ, నేరుగా సంబంధిత పోలీస్‌స్టేషన్లకు తెలపాలని ఎస్పీ నర్సింహ కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. గంజాయి నిర్మూలన కోసం ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపట్టిందన్నారు. గంజాయితో సమాజం మొత్తం కలుషితం అవుతుందన్నారు. విద్యార్థులు, యువత వారి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సూర్యాపేటలో డీఅడిక్షన్ కేంద్రం ఏర్పాటు విషయంలో కలెక్టర్‌ను సంప్రదించి నిర్ణయం తీసుకుంటామన్నారు. సమావేశంలో అదనపు ఎస్పీ మేక నాగేశ్వర్‌రావు, కోదాడ డీఎస్పీ మామిళ్ల శ్రీధర్‌రెడ్డి, కోదాడ పట్టణ ఇన్‌స్పెక్టర్ రాము, ఎస్‌ఐలు సైదులు, లింగయ్య, సిబ్బంది శ్రీనివాస్, రామారావు, సతీష్, ఎల్లారెడ్డి, ఫరీద్, శివకుమార్, నాగేంద్రబాబు ఉన్నారు.

కడుపునొప్పి భరించలేక

## వ్యక్తి ఆత్మహత్య

సూర్యాపేటక్రైం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా కేంద్రంలో కడుపునొప్పి భరించలేక వ్యక్తి మంగళవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పట్టణ ఇన్‌స్పెక్టర్ వీరరాఘవులు తెలిపిన వివరాల ప్రకారం విజయవాడకు చెందిన షేక్ పీర్‌సాహెబ్(40) మూడేళ్లుగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. పలు ఆస్పత్రుల్లో చూపించినా తగ్గలేదు. పీర్ సాహెబ్ ఐదేళ్ల క్రితం విజయవాడ నుంచి సూర్యాపేటకు వచ్చి ప్రియాంకకాలనీలో ఇంటిని అద్దెకు తీసుకుని నివసిస్తున్నాడు. భార్య, కుమారుడు విజయవాడలోనే ఉంటున్నారు. సూర్యాపేటలో సెంట్రింగ్ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కాగా ఈ నెల 10న రాత్రి కడుపునొప్పి భరించలేక ఇంట్లో ఉరేసుకున్నాడు. ఈ నెల 11న ఉదయం ఇంటి తలుపులు తెరవకపోయేసరికి పక్కింటి వాళ్లు కిటికిలోంచి చూడగా ఉరేసుకుని మృతి చెంది ఉన్నాడు. ఈ విషయమై పోలీసులకు, మృతుడి భార్యకు స్థానికులు సమాచారమిచ్చారు.భార్య షహీనా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

పోలీస్‌స్టేషన్ ఆవరణలో యువకుడి


## ఆత్మహత్యాయత్నం

తుంగతుర్తి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా తుంగతుర్తి పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నం చేశాడు. సోమవారం రాత్రి జరిగిన సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. ఎస్‌ఐ రుద్ర కాంత్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం తుంగతుర్తి మండలం రావులపల్లి గ్రామానికి చెందిన గొల్లపల్లి నాగయ్యకు యాదాద్రిభువనగిరి జిల్లా అడ్డగూడూరు మండలం లక్ష్మీదేవికాల్వ గ్రామానికి చెందిన యువతితో మూడేళ్ల కిందట వివాహమైంది. కొంతకాలంగా ఇద్దరి మధ్య కలహాలు జరుగుతున్నాయి. కొద్దిరోజుల కిందట భార్య పుట్టింటికి వెళ్లింది. భార్యను కాపురానికి రమ్మని పిలవడానికి సోమవారం లక్ష్మీదేవికాల్వలోని అత్తింటికి నాగయ్య వెళ్లాడు. అక్కడ మాటామాటా పెరిగి ఘర్షణ చోటుచేసుకుంది. దీంతో అత్తింటివారు అతడిపై చేయి చేసుకున్నారు. అక్కడి నుంచి నాగయ్య బైక్‌పై ఇంటికి వస్తుండగా, అదే సమయంలో అడ్డగూడూరు పోలీసులకు భార్య ఫిర్యాదు చేసింది. పోలీస్ స్టేషన్‌కు రావాలని అడ్డగూడూరు పోలీసులు నాగయ్యకు ఫోన్ చేశారు. భయపడిన నాగయ్య బైక్‌లోని పెట్రోల్‌ను కొంతతీసి బాటిల్‌లో పట్టుకున్నాడు. తుంగతుర్తి పోలీస్ స్టేషన్ ఆవరణకు చేరుకొని ఒంటిపై పెట్రోలు పోసుకొని ఆత్మహత్యాయత్నం చేశాడు. వెంటనే స్పందించిన పోలీసులు అతడికి ప్రథమ చికిత్స చేయించి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. నాగయ్య ఆరోగ్యం కుదుటపడ్డాక స్టేషన్‌కు రావాలని, భార్యాభర్తలకు కౌన్సెలింగ్ చేస్తామని చెప్పినట్లు ఎస్‌ఐ తెలిపారు.

గుర్తు తెలియని వాహనం

## ఢీకొని వృద్ధుడి మృతి

దామరచర్ల, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : గుర్తుతెలియని వాహనం ఢీకొని నల్లగొండ జిల్లా దామరచర్ల మండలంలో మంగళవారం ఓ వృద్ధుడు మృతి చెందాడు. ఎస్‌ఐ శ్రీకాంత్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కొండ్రపోల్ గ్రామానికి చెందిన కుంకునూరి నరసింహారావు(70) ఉదయం గ్రామ శివారులోని నార్కట్‌పల్లి-అద్దంకి రహదారిపై నడుచుకుంటూ వెళ్తున్నాడు. మిర్యాలగూడ నుంచి గుంటూరు వైపు వెళ్లే గుర్తు తెలియని వాహనం వెనుక నుంచి ఢీకొట్టడంతో తీవ్రగాయాలై నరసింహారావు అక్కడికక్కడే మృతిచెందారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. నరసింహారావు భార్య నాగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.


నది జలాలతో నింపిన కలశాలు తీసుకొస్తున్న ప్రధాన అర్చకుడు నల్లన్‌థిఘల్ లక్ష్మీనర్సింహాచార్యులు, అర్చకులు

## యాదగిరీశుడి బ్రహ్మోత్సవాలు
# పరిసమాప్తం

● యాదగిరీశుడికి వైభవంగా అష్టోత్తర శతఘటాభిషేకం ● కన్నుల పండువగా శృంగార డోలోత్సవం


అష్టోత్తర పూజల్లో పాల్గొన్న కలెక్టర్ హనుమంతరావు

యాదాద్రి, యాదగిరిగుట్ట, మార్చి 11(ఆంధ్రజ్యోతి): ఏకశిఖర వాసుడు స్వయంభూ పంచనారసింహుడు లక్ష్మీనరసింహుడి వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం పరిసమాప్తమయ్యాయి. ఉదయం అష్టోత్తర శతఘటాభిషేకం, రాత్రికి శృంగార డోలోత్సవాలతో 11రోజులుగా అత్యంత వైభవంగా పాంచారాత్రాగమ శాస్త్రపద్ధతిలో కొనసాగిన బ్రహ్మోత్సవాలు ముగిశాయి.

### అష్టోత్తర శతఘటాభిషేకం

బ్రహ్మోత్సవాల్లో ఆసాంతం భక్తులను కటాక్షించేందుకు దశావతారాల్లో వివిధ వాహన సేవలో అనుగ్రహించిన లక్ష్మీనరసింహుడిని 108 కలశాలతో అభిషేకించారు. ఆలయ ముఖ మండపంలో 108 వెండి కలశాలను ఏర్పాటు చేశారు. కలశాలలో పవిత్ర సప్తనదీ జలాలను, పంచామృతాలు, ఔషధాలతో నింపిన అర్చకులు దర్భ, మామిడి ఆకులను, కొబ్బరికాయలు, వస్త్రాలతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేకపూజలు చేశారు. అంతకు ముందు విశ్వక్సేన పూజలతో పుణ్యాహవాచనం హవన పూజలు చేసి సంప్రదాయరీతిలో పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం వేదపండితులు, రుత్వికులు పంచసూక్తము, దశశాంతులు, పంచోపనిషత్తుల పఠనాలు, ఆస్థాన విద్వాంసులు మంగళవాయిద్యాల నడుమ కవచమూర్తులు, ఉత్సవ మూర్తులను అష్టోత్తర శత కలశాలతో అభిషేకించారు. తులసీ దళాలు, వివిధ రకాల పూలతో స్వామి, అమ్మవార్లను అర్చించారు. దేవస్థాన ప్రధానార్చకుడు నల్లన్‌థిఘల్ లక్ష్మీనరసింహాచార్యులు యాదాద్రి క్షేత్ర మహత్యాన్ని భక్తులకు వివరించారు. ఈ వైశేషిక బ్రహ్మోత్సవ పర్వాలను ప్రధానార్చకుడు కాండూరి వెంకటాచార్యులు తదితరులు నిర్వహించారు.

### రుత్విక సన్మానం

లక్ష్మీనరసింహుల వార్షిక బ్రహ్మోత్సవాల్లో చతుర్వేద, దివ్యప్రబంధ, క్షేత్ర మహాత్మ్య, నాలాయర దివ్య ప్రబంధపారాయణాలు, మూలమంత్ర, మూర్తి మంత్ర జపాలు, హోమపూజలు నిర్వహించిన రుత్వికులను అష్టోత్తర శత ఘటాభిషేకం అనంతరం ఆలయ అనువంశిక ధర్మకర్త నరసింహమూర్తి, ఈవో ఏపూరి భాస్కర్‌రావు ఘనంగా సన్మానించారు.

### శృంగార డోలోత్సవం

స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు 11రోజుల పాటు నిర్విఘ్నంగా కొనసాగాయి. మంగళవారం లక్ష్మీనృసింహులను పట్టుపీతాంబరాలు, ముత్యాలు, రత్నాల ఆభరణాలు, వజ్రవైఢూర్యాలు, వివిధ రకాల పూలతో దివ్యమనోహరంగా అలంకరించి డోలిక (ఊయల)లో అధిష్ఠింపజేశారు. స్వామిని సకల జగత్తును రక్షింపమని కోరుతూ సర్వవిధ రాగ తాళాలతో, సహస్రనామాలతో కొలుస్తూ శృంగార డోలారోహణపర్వాన్ని నిర్వహించారు.


### ఉచిత వైద్య శిబిరం

వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా నీలిమ ఆసుపత్రి కో ఆర్డినేటర్ ఎడ్ల భరత్‌రెడ్డి, డాక్టర్ శివకుమార్ ఆధ్వర్యంలో కొండపైన ఈ నెల ఒకటో తేదీ నుంచి 11వ తేదీ వరకు నిత్యం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.

### నిత్య పూజల పునరుద్ధరణ

వార్షిక బ్రహ్మోత్సవాల నేపథ్యంలో రద్దుచేసిన నిత్యపూజలు బుధవారం వేకువజామునుంచి పునః ప్రారంభించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా 11రోజులపాటు నిత్య కల్యాణం, బ్రహ్మోత్సవం, సుదర్శన హోమం, సాయంత్రం వెండీ జోడు సేవలు, ఏకాదశి లక్షపుష్పార్చన పూజాది కార్యక్రమాలు అదేవిధంగా ఈ నెల 7 నుంచి 9వ తేదీ వరకు రాత్రి అర్చన, భోగాలు, 10 నుంచి 11వ తేదీ వరకు ఉదయం నిర్వహించాల్సిన అభిషేకాలు, అర్చనలు తిరిగి పునరుద్ధరించారు.

### ఏడు అలంకరణ సేవలు...ఎనిమిది వాహన సేవలు


రామావతారంలో..

ఆలయ ప్రాశాస్త్యం, లోక కల్యాణం కోసం స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు 11 రోజులపాటు వైభవంగా కొనసాగాయి. ఈ నెల 1 నుంచి 11వ తేదీ వరకు అనువంశిక ధర్మకర్త భాస్కరాయణి నరసింహమూర్తి, ఈవో ఏపూరి భాస్కర్‌రావు పర్యవేక్షణలో అంగరంగ వైభవంగా వార్షికోత్సవాలు కొనసాగాయి. మూడో రోజు సోమవారం ఉదయం మత్స్యావతారం, రాత్రి శేష వాహన సేవ, నాలుగో రోజు మంగళవారం ఉదయం వటపత్రశాయి అలంకరణ, రాత్రి హంస వాహన సేవ, ఐదో రోజు బుధవారం ఉదయం శ్రీ కృష్ణాలంకరణ (మురళీకృష్ణుడు), రాత్రి పొన్న వాహన సేవ, ఆరో రోజు గురువారం ఉదయం గోవర్ధనగిరిధారి అలంకరణ, సింహ వాహన సేవ, ఏడో రోజు శుక్రవారం ఉదయం జగన్మోహిని అలంకరణ, రాత్రి అశ్వవాహన సేవలో ఎదుర్కోలు మహోత్సవం, ఎనిమిదో రోజు శనివారం ఉదయం శ్రీ రామఅలంకరణ (ఉదయం హనుమంత సేవ), రాత్రి గజ వాహనంలో తిరుకల్యాణోత్సవం, తొమ్మిదో రోజు ఆదివారం శ్రీ మహావిష్ణువు అలంకరణ (ఉదయం గరుడ వాహన సేవ)లను వైభోపేతంగా నిర్వహించారు.

### విద్యుద్దీపాల అలంకరణతో..

వార్షిక బ్రహోత్సవాల్లో భాగంగా యాదగిరి క్షేత్రాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. గత నెల 19 నుంచి 23 వరకు స్వర్ణ దివ్య విమాన రాజగోపురం మహాకుంభాభిషేక సంప్రోక్షణ మహోత్సవం, 23న సీఎం రేవంత్‌రెడ్డి విమాన రాజగోపురాన్ని ప్రారంభించారు. అదే రోజు నుంచి కొండపైన శివాలయంలో మహాశివరాత్రోత్సవాలు మొదలై 28న ముగిశాయి. ఆ మరుసటి రోజు నుంచి ప్రారంభమైన యాదగిరిగుట్ట వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 11 వరకు కొనసాగాయి. ఈ వేడుకల సందర్భంగా క్షేత్రం విద్యుత్ కాంతులీనగా భూలోక వైకుంఠపురంగా క్షేత్రం భక్తులను కనువిందు చేసింది. రంగు రంగుల విద్యుత్ దీపాలతో కొండ చుట్టూ రింగ్ రోడ్డు, వైకుంఠ ద్వారం, కొండంత బ్రహ్మోత్సవ వైభవం ఉట్టిపడింది. రాత్రివేళ కొండపైన ఆలయం బంగారు వర్ణం, కొండ చుట్టూ ఇంద్ర ధనస్సు విరిసినట్లుగా యాదగిరిక్షేత్రం నేత్రానందం కలిగించింది.

### అలరించిన సాంస్కృతిక సభలు

గతంకంటే భిన్నంగా ఉత్సవాల సందర్భంగా ధార్మిక, సాహిత్య, సంగీత మహాసభలు కొనసాగాయి. ఆలయ తిరువీధిలో ప్రత్యేక సంగీత కళాతోరణంలో సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కాగా, ఈ నెల 1వ తేదీ నుంచి 3వ తేదీ వరకు మూడు రోజుల పాటు నిత్యం సాయంత్రం 6 నుంచి 9 గంటల వరకు సహస్రావధాని, డాక్టర్ గరికపాటి నరసింహారావు ఎర్రాప్రగడ రచించిన నృరసింహ వైభవం ఆధ్యాత్మిక ప్రవచనాలు చేశారు. ప్రవచనాలు వినేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. 4న మాధవపెద్ది సురేష్ ప్రముఖ సినీ నేపథ్యగాయకుల భక్తి సంగీత విభావరి, 5న ప్రముఖ జానపద గాయకురాలు తేలు విజయ భక్తి సంగీతం, 6న ప్రముఖ శాస్త్రీయ సంగీతం, టీటీడీ ఆస్థాన విద్వాంసులు, కీర్తిశేషులు గరిమెళ్ల బాలకృష్ణప్రసాద్ అన్నమాచార్య సంకీర్తన విభావరి, 7న అన్నమయ్య డాక్టర్ శోభారాజ్ భక్తి సంగీత విభావరి, 10న కోమాండూరి రామాచార్యులు బృందం భక్తి సంగీత విభావరి ఆధ్యాత్మిక చింతన వైపు భక్తులను రంజింపజేశాయి.

### ఆధ్యాత్మిక సేవలకు ఐఎస్‌వో సర్టిఫికెట్

ఆధ్యాత్మిక సేవలకు గుర్తింపుగా ఐఎస్‌వో సర్టిఫికెట్‌ను ఆ సంస్థ ప్రతినిధి అందజేశారు. కొండపైన మంగళవారం దేవదాయ శాఖ సెక్రెటరీ శైలజా రామయ్యర్, ఆలయ ఈవో భాస్కర్‌రావు, అనువంశిక ధర్మకర్త భాస్కరాయణి నరసింహమూర్తి ఐఎస్‌వో సర్టిఫికెట్ అందుకున్నారు. ఈ సందర్భంగా శైలజా రామయ్యర్ మాట్లాడుతూ 2018 సంవత్సరంలో పర్యావరణం, భద్రత, నిర్వహణ, విద్యుత్ సరఫరా అనే అంశాలపై హెచ్‌వైఎం అంతర్జాతీయ సంస్థ నుంచి ఐఎస్‌వో సర్టిఫికెట్ అందుకోగా అప్పట్లో ఆధ్యాత్మిక అభ్యాసానికి అనుకూలమైన స్థలాన్ని అందించడంలో నాణ్యతా ప్రమాణాలకు పెద్దపీట వేసినట్లు స్పష్టమైందన్నారు. దేవుడికి నైవేద్యంగా భక్తులు సమర్పించే భోజనం ప్రసాదం అందించడం, దైవ అనుగ్రహాన్ని సూచిస్తూ ఆధ్యాత్మిక అనుభూతిని పెంచే లక్ష్యానికి అనుగుణంగా రెండోసారి ఐఎస్‌వో (9001:2015 పరిసరాల పరిశుభ్రత, ఆలయ నిర్వహణ, 22000:2018 ప్రసాదాల తయారీ, పంపిణీ ప్రక్రియ) సర్టిఫికెట్ ఆలయానికి దక్కడం ఎంతో ప్రతిష్ఠాత్మకమన్నారు. అంతర్జాతీయస్థాయిలో రెండుసార్లు హెచ్‌వైఎం సంస్థ తరఫున గుర్తింపు రావడం నాణ్యత ప్రమాణాలకు నిదర్శనమన్నారు. అదేవిధంగా స్వర్ణ దివ్య విమాన రాజగోపురం పనుల పూర్తికి కృషి చేసిన ఈవో, అనువంశిక ధర్మకర్త, డీఈవో, ఏఈవో, పర్యవేక్షకులను జ్ఞాపికతో, వార్షిక బ్రహ్మోత్సవాలు విజయవంతం చేసినందుకు ముగింపు సందర్భంగా క్షేత్ర పర్యటనకు వచ్చిన ఆమె అధికార, అర్చక, ఆలయ సిబ్బందిని ఘనంగా సన్మానించారు.


ఐఎస్‌వో సర్టిఫికెట్ అందుకుంటున్న శైలజా రామయ్యర్, ఈవో భాస్కర్‌రావు

# హామీలను నెరవేర్చేనా?

(5వపేజీ తరువాయి)

పూర్తికాగా, కాల్వల పనులు వేగంగా సాగుతున్నాయి. వచ్చే ఆరేడు నెలల్లో ఈ పథకం పూర్తిగా లక్ష ఎకరాల ఆయకట్టుకు నీరిచ్చేలా పనులు పూర్తిచేస్తారని ఆశిస్తున్నారు. వీటితో పాటు డిండి ఎత్తిపోతల పథకం కింద నిర్మాణంలో ఉన్న ఏడు రిజర్వాయర్ల పనులు చురుగ్గా సాగుతుండగా, మునుగోడు నియోజకవర్గంలో కాల్వల పనులు వేగంగా పూర్తవుతున్నాయి. ఈ పథకానికి నీరందించే ఏదుల-డిండి అనుసంధాన పథకానికి భారీగా నిధులు తెచ్చి పనులు పూర్తిచేయాలని రైతులు కోరుతున్నారు. వీటికితోడు మూసీ కాల్వలైన పిల్లాయిపల్లి, ధర్మారెడ్డిపల్లి, అసిఫ్‌నహర్, తదితర కాల్వలు ఇప్పటికే రూ.450కోట్ల నిధులు మంజూరవగా, ఈ పనులన్నింటినీ త్వరలో చేపట్టేందుకు అవసరమైన ఒత్తిడిని ఎమ్మెల్యేలు తీసుకురావాలని కోరుతున్నారు. నాగార్జునసాగర్ నియోజకవర్గంలోని నెల్లికల్లు ఎత్తిపోతల పథకాన్ని దశలవారీగా పూర్తిచేయాలని, దేవరకొండ, నాగార్జునసాగర్, మిర్యాలగూడ, కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల్లో చేపట్టిన ఎత్తిపోతల పథకాలను యుద్ధప్రాతిపదికన పూర్తిచేసేందుకు మరింత సీరియస్‌గా దృష్టిసారించాలని కోరుతున్నారు. వీటితో పాటుగా ఇతర హామీలను అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ఎమ్మెల్యేలు మననం చేసుకొని నిధులు సాధించడంతో పాటు, పనుల పురోగతికి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. అదేవిధంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా భారీగా పెండింగ్ ఉన్న డబుల్‌రోడ్ల నిర్మాణాలు, సింగిల్‌రోడ్ల నిర్మాణాలు, మరమ్మతులు చేపట్టేందుకు మంత్రులు, ఎమ్మెల్యేలు చొరవ తీసుకుంటారని ఆశిస్తున్నారు.

# పెద్దల సభలో పెరిగిన ప్రాతినిధ్యం

(5వపేజీ తరువాయి)

ఐదు నుంచి ఎమ్మెల్సీగా కొనసాగుతున్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీగా కొనసాగుతున్న తీన్మార్ మల్లన్న కాంగ్రెస్ అభ్యర్థిగా నల్లగొండ-వరంగల్-ఖమ్మం స్థానం నుంచి గెలుపొంది, 2024 జూన్ 7 నుంచి ఎమ్మెల్సీగా బాధ్యతల్లో ఉన్నారు. నల్లగొండ-ఖమ్మం-వరంగల్ ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి ఈనెల 30న పదవి ముగిసిన అలుగుబెల్లి నర్సిరెడ్డి కూడా ఉమ్మడి జిల్లాకు చెందినవారే. తాజాగా, జరిగిన ఈ నియోజకవర్గ ఎన్నికలో ఆయన ఓటమిపాలవడంతో మరోసారి ఎమ్మెల్సీగా అవకాశం దక్కలేదు. అయితే ఎమ్మెల్యే కోటా నుంచి కాంగ్రెస్ నుంచి అద్దంకి దయాకర్, కేతావత్ శంకర్ నాయక్, దాసోజు శ్రవణ్‌కుమార్, నెల్లికంటి సత్యానికి అవకాశం దక్కడంతో అనూహ్యంగా మండలిలో ఉమ్మడి జిల్లా ప్రాతినిధ్యం పెరిగినట్టయింది.

**ఉమ్మడి జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎమ్మెల్సీలు, పదవీకాలం**

| ఎమ్మెల్సీ | పదవి ముగిసే తేదీ |
| --- | --- |
| తీన్మార్ మల్లన్న | 29-3-2027 |
| గుత్తా సుఖేందర్‌రెడ్డి | 21-11-2027 |
| మంకెన కోటిరెడ్డి | 04-01-2028 |
| డాక్టర్ అద్దంకి దయాకర్ | 29-03-2029 |
| దాసోజు శ్రవణ్‌కుమార్ | 29-03-2029 |
| కేతావత్ శంకర్‌నాయక్ | 29-03-2029 |
| నెల్లికంటి సత్యం | 29-03-2029 |

### గతంలోనూ కీలకనేతలకే ఎమ్మెల్సీలుగా అవకాశాలు

శాసనమండలి పునరుద్ధరణ తర్వాత జిల్లా నుంచి మండలి సభ్యులుగా కీలక నేతలకే అవకాశాలు దక్కాయి. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో సీపీఎం, సీపీఐతో కాంగ్రెస్ పొత్తు నేపథ్యంలో ఆ సమయంలో ఇచ్చిన హామీ మేరకు మండలి పునరుద్ధరణ జరిగిన వెంటనే 2017లో ఉమ్మడి జిల్లాకు చెందిన సీపీఎం నేత చెరుపల్లి సీతారాములుకు ఎమ్మెల్సీగా అవకాశం దక్కింది. బీఆర్‌ఎస్‌లో కీలక నేతగా, రాష్ట్ర హోంమంత్రిగా పనిచేసిన నాయిని నరసింహారెడ్డి, దేవరకొండ ఎమ్మెల్యేగా పనిచేసిన భారతీరాగ్యానాయక్, ప్రస్తుతం మునుగోడు ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్న కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, శాసనమండలి డిప్యూటీ చైర్మన్‌గా పనిచేసిన నేతి విద్యాసాగర్ ఎమ్మెల్సీలుగా ఎన్నికయ్యారు. కర్నె ప్రభాకర్, పూలరవీందర్, డాక్టర్ తేరా చిన్నపరెడ్డి జిల్లా నుంచి ఎమ్మెల్సీలుగా ప్రాతినిధ్యం వహించారు.

## వచ్చే నెల 11 నుంచి
# ఎంజీయూ పరిధిలో డిగ్రీ పరీక్షలు




నల్లగొండ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం పరిధిలో డిగ్రీ పరీక్షలు ఏప్రిల్ 11వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు సీవోఈ జి.ఉపేందర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ ఒకటో సెమిస్టర్ 11వ తేదీన, మూడో సెమిస్టర్ 16వ తేదీన జరుగుతుందన్నారు. 5వ సెమిస్టర్ ఏప్రిల్ 15న బ్యాక్‌లాగ్ విద్యార్థులకు, ఏప్రిల్ 16 నుంచి రెండు, నాలుగు, ఆరు సెమిస్టర్‌ల రెగ్యులర్, బ్యాక్‌లాగ్ విద్యార్థులకు నిర్వహించనున్నట్లు తెలిపారు. సీబీఎస్‌ఈ విధానంలో డిగ్రీ అభ్యసించి ఉత్తీర్ణత సాధించని వారికి చివరి అవకాశం కల్పించి ఒకటి నుంచి ఆరు సెమిస్టర్‌ల వరకు బ్యాక్‌లాగ్ పరీక్షలను ఏప్రిల్ 4 నుంచి నిర్వహిస్తామన్నారు. పరీక్ష టైం టేబుల్ విశ్వవిద్యాలయ వెబ్‌సైట్‌లో పొందుపర్చామన్నారు.

### బీఈడీ కళాశాలలు విద్యా ప్రమాణాలు పాటించాలి

ఉత్తమ ఉపాధ్యాయుల కోసం బీఈడీ కళాశాలలు విద్యా ప్రమాణాలు పాటించాలని వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ అన్నారు. ఎంజీయూలో మంగళవారం బీఈడీ కళాశాలల అకడమిక్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ భవిష్యత్తును దిశా నిర్దేశం చేయగల, శక్తివంతమైన సమాజాన్ని సృష్టించే బీఈడీ కళాశాలలపై గురుతర బాధ్యత ఉందన్నారు. కార్యక్రమంలో వై.ప్రశాంతి, జయంతి, అమరేందర్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రూప్స్ ఫలితాల్లో మనోళ్ల హవా

● గ్రూప్-2లో రాష్ట్రస్థాయి ప్రథమ ర్యాంకు ● గ్రూప్-1లో అత్యధిక మార్కులు సాధించిన పలువురు ఉద్యోగులు ● ఉమ్మడి జిల్లావాసుల ప్రతిభ


పవన్‌కుమార్

శాలిగౌరారం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం ఇటుకులపహాడ్ గ్రామానికి చెందని రచ్చ శ్రీనివాస్- తిరుమలేశ్వరీ దంపతుల ఏకైక కుమారుడు రచ్చ పవన్ కుమార్ గ్రూపు-2 ఫలితాల్లో 401 మార్కులు సాధించాడు. పవన్ కుమార్ ప్రస్తుతం నల్లగొండ జిల్లా పెద్దఅడిశర్లపల్లి తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. ఇటీవల ప్రకటించిన గ్రూప్-1 ఫలితాల్లో కూడా 434 మార్కులు వచ్చాయని, మంచి ర్యాంక్ వచ్చే అవకాశముందని పవన్ కుమార్ ఆశాభావం వ్యక్తంచేశారు.

### మిర్యాలగూడవాసికి గ్రూప్-2లో 104వ ర్యాంకు


వీరశేఖర్

మిర్యాలగూడ టౌన్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన జుట్టుకొండ వీర శేఖర్ గ్రూప్-2 ఫలితాల్లో 104వ ర్యాంకు సాధించాడు. స్థానిక గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సన్నద్ధమైన వీరశేఖర్ పట్టణంలోని ప్రైవేట్ పాఠశాలలో పదో తరగతి విద్యనభ్యసించి 504 మార్కులు సాధించాడు. నారాయణ కళాశాలలో ఇంటర్ చదివిన శేఖర్ గీతమ్ కళాశాలలో ఇంజనీరింగ్ విద్యను పూర్తి చేశాడు. ఇటీవల గ్రూప్-4 పరీక్ష రాసిన శేఖర్ వైద్యశాఖలో జూనియర్ హెల్త్ అసిస్టెంట్‌గా ఉద్యోగం పొందాడు.

### గ్రూప్-1కు వెంకటరమణ ఎంపిక


వెంకటరమణ

హాలియా, మార్చి 11(ఆంధ్రజ్యోతి): టీజీపీఎస్సీ విడుదల చేసిన గ్రూప్-1 ఫలితాల్లో అనుముల మండలంలోని అలీనగర్ పీఎస్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు, టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర జిల్లా కార్యదర్శి అయిన రమాదేవి, శ్రీనివాస్‌రావు కుమారుడు దాది వెంకటరమణ 535.5 మార్కులు సాధించి ఎంపికయ్యారు. వెంకటరమణ బీటెక్ ఎన్‌ఐటీ వరంగల్‌లో పూర్తిచేసి తర్వాత సివిల్స్‌పై మక్కువతో ప్రిపేర్ అవుతూ గ్రూప్-1 రాసి 535 మార్కులు సాధించడంతో డిప్యూటీ కలెక్టర్ ఉద్యోగం వచ్చేందుకు అవకాశం ఉంది.

### కీర్తనకు సన్మానం


కీర్తన

గ్రూప్-1 ఫలితాల్లో 462.5 మార్కులతో విజయం సాధించిన అనుముల మండలం మాజీ ఎంపీపీ అల్లి నాగమణిపెద్దిరాజు కుమార్తె కీర్తనయాదవ్‌ను మంగళవారం హాలియా యాదవ సంఘం అధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు కీర్తనను శాలువాలతో సన్మానించి అభినందనలు తెలిపారు.

### డిండివాసికి 80వ ర్యాంక్


వినయ్

డిండి, మార్చి 11(ఆంధ్రజ్యోతి): డిండి మండలంలోని రుద్రాయిగూడెం గ్రామానికి చెందిన పానుగోటి వినయ్ మంగళవారం వెలువడిన గ్రూపు2 ఫలితాల్లో 80వ ర్యాంక్ సాధించాడు. 2024 డిసెంబరు 15, 16 తేదీల్లో నిర్వహించిన గ్రూపు-2 పోటీ పరీక్షల్లో 600 మార్కులకు గాను 396.5 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో 80వ ర్యాంక్ దక్కించుకున్నాడు.

### గ్రూప్-1లో అధికారుల ప్రతిభ


నాగార్జున్‌రెడ్డి


లావణ్య


శ్రీనివాస్‌రెడ్డి

హుజూర్‌నగర్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): హుజూర్‌నగర్ మండల అధికారులుగా పనిచేస్తున్న పలువురు గ్రూప్-1లో అత్యధిక మార్కులు సాధించారు. తహసీల్దార్‌గా పనిచేస్తున్న మందడి నాగార్జునరెడ్డి 900 మార్కులకు 448 మార్కులు సాధించారు. నల్లగొండ జిల్లా తిరుమలగిరి సాగర్ మండలంలోని బోయగూడెంకు చెందిన తహసీల్దార్ నాగార్జునరెడ్డి నల్లగొండ పట్టణంలో స్థిరపడ్డారు. అదేవిధంగా హుజూర్‌నగర్ మునిసిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న కె.శ్రీనివాసరెడ్డి గ్రూప్- 1 ఫలితాల్లో 452 మార్కులు సాధించారు. ఎంపీడీవోగా పనిచేస్తున్న లావణ్య 421.5 మార్కులు సాధించారు. హుజూర్‌నగర్ మండలంలో గెజిటెడ్ అధికారులుగా పనిచేస్తూనే గ్రూప్-1లో అత్యధిక మార్కులు సాధించారు.

### గ్రూప్ 2కు రాంశా ఎంపిక


రాంశా

నల్లగొండ క్రైం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-2 ఫలితాల్లో నల్లగొండ పట్టణానికి చెందిన అనంతుల రాంశా ప్రతిభ కనబర్చాడు. 404.6 మార్కులు సాధించి గ్రూప్-2 ఉద్యోగానికి అర్హత సాధించారు. నల్లగొండ పట్టణం నాగార్జున కాలనీకి చెందిన రాంశా చిన్నప్పటి నుంచే కష్టపడి చదివే వారు. రాంశా తండ్రి శ్రీనివాస్ వ్యవసాయ శాఖలో సూపరింటెండెంట్‌గా, తల్లి ప్రభుత్వ టీచర్‌గా పని చేస్తున్నారు.


సతీష్

సూర్యాపేటటౌన్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన గ్రూప్ -1 ఫలితాల్లో సూర్యాపేట జిల్లా వాసికి ఉత్తమ మార్కులు వచ్చాయి. సూర్యాపేట జిల్లా మోతె మండలం సిరికొండ గ్రామానికి చెందిన గుణగంటి సతీష్ గ్రూప్-1 ఫలితాల్లో 463.5 మార్కులతో ఉత్తమ ఫలితాలు సాధించాడు. సతీష్ గత జనవరి 2వతేదీన సూర్యాపేట మునిసిపాలిటీలోని 10వార్డు అధికారిగా బాధ్యతలు స్వీకరించాడు. వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చిన సతీష్ రాష్ట్రంలోనే 132 ర్యాంకు సాధించడం గమనర్హం.


సాయి కృష్ణారెడ్డి

మోత్కూరు: ప్రభుత్వం మంగళవారం విడుదల చేసిన గ్రూపు-2 ఫలితాల్లో మోత్కూరు మండల కేంద్రానికి చెందిన గుర్రం మోహన్‌రెడ్డి-స్వరాజ్యం దంపతుల కుమారుడు సాయి కృష్ణారెడ్డి రాష్ట్రస్థాయి 11వ ర్యాంకు సాధించాడు. రైతు కుటుంబానికి చెందిన అతను రాష్ట్రస్థాయి ర్యాంకు సాధించడంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.

### గ్రూప్-2లో స్టేట్ ఫస్ట్ ర్యాంక్


వెంకటహర్షవర్ధన్‌రెడ్డి

కోదాడ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): టీజీపీఎస్సీ ప్రకటించిన గ్రూప్-2 ఫలితాల్లో, సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణానికి చెందిన నారు వెంకటహర్షవర్ధన్‌రెడ్డి రాష్ట్రస్థాయి మొదటి ర్యాంకు సాధించారు. వెంకటహర్షవర్ధన్‌రెడ్డి పదో తరగతి ఖమ్మంలో, ఇంటర్ విజయవాడ, బీటెక్ తాడేపల్లి ఎన్ఐటీలో 2021లో పూర్తిచేశారు. అనంతరం సివిల్స్‌లో కోచింగ్‌కు ఢిల్లీ వెళ్లారు. కోచింగ్ తీసుకుంటుండగా, 2022లో రాష్ట్ర ప్రభుత్వం గ్రూప్-2 నోటిఫికేసన్ విడుదల చేయగా, ఆయన పరీక్ష రాయగా 600మార్కులకు వెంకట హర్షవర్ధన్‌రెడ్డి 447మార్కులు సాధించి, రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంకు సాధించారు. ప్రథమ ర్యాంకు సాధించటంపట్ల తల్లిదండ్రులు రవనారెడ్డి, వసుంధర హర్షం వ్యక్తం చేశారు. రవనారెడ్డి కోదాడ కేఆర్‌ఆర్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా వెంకటహర్షవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ అమ్మా, నాన్నల ప్రోత్సాహంతోనే ఈ విజయం సొంతమైందన్నారు. మొదటి ర్యాంకు రావటం సంతోషంగా ఉందని చెప్పారు.

## మోడల్ స్కూల్‌లో ప్రవేశానికి గడువు పొడగింపు

శాలిగౌరారం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వల్లాల ప్రభుత్వ మోడల్ స్కూల్‌లో ప్రవేశానికి దరఖాస్తు గడువు ఈనెల 20 వరకు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ కృష్ణ మోహన్ తెలిపారు. దరఖాస్తు చేసుకొని అభ్యర్థులు సకాలంలో చేసుకోవాలని సూచించారు. ప్రవేశపరీక్ష ఏప్రిల్ 20న నిర్వహించనున్నట్లు వివరించారు. వివ రాలకు మోడల్ స్కూల్ వెబ్‌సైట్‌ను చూడాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

## విద్యార్థినులకు సైకిళ్లు పంపిణీ

మర్రిగూడ, మార్చి11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దామెరభీమనపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల 10మంది విద్యార్థినులకు సేవ ఫౌండేషన్ ఎన్ఆర్ఐలు ఆధ్వర్యంలో సైకిళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో బిట్టు శ్రీనివాస్ సేవ స్ఫూర్తితో ఎన్ఆర్ఐలు ఇంకా నిరుపేదలకు సాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంజీవరావు, ఉపాధ్యాయ బృందం ఉన్నారు.

# కలగానే 'కళాభారతి'

జిల్లా కేంద్రంలో నిర్మించతలపెట్టిన కళాభారతి నిర్మాణం కలగానే మిగిలింది. రెండేళ్ల క్రితం గత బీ ఆర్ఎస్ ప్రభుత్వం లాఛనంగా శంకుస్థాపన చేయగా నేటికి పనులు ప్రారంభం కాలేదు.
- (ఆంధ్రజ్యోతి-నల్లగొండ)

● రెండేళ్లుగా శిలఫలాకానికే పరిమితం
● ఇప్పటి వరకు విడుదల కాని నిధులు
● కవులు, కళాకారులకు తప్పని తిప్పలు



నల్లగొండ క్లాక్ టవర్ సెంటర్‌లో కళాభారతి ప్రతిపాదిత స్థలం (ఇన్‌సెట్)లో కళాభారతి కోసం వేసిన శిలాఫలకం

నల్లగొండ జిల్లా కళారంగం, సాహిత్య పరంగా ఎంతో చైతన్యవంతమైనది. తెలుగు సాహిత్యానికి ఎందరో ఉద్దండులైన సాహితీవేత్తలను అందించిన నేల ఇది. సాహిత్య చరిత్రలో నిలిచిపోయే ఎన్నో సభలు, పుస్తకావిష్కరణలు నల్లగొండలో జరిగాయి.ఎందరో కళాకారులు ఈ జిల్లా నుంచి ఎదిగి కళా రంగాల్లో వెలుగొందారు. అలాంటి నేలపైన కవులు, కళాకారులకు వేదికలు లేకపోవడం వల్ల అనేక ఇబ్బందులు పడుతున్నారు. మునిసిపల్ శాఖ ఆధ్వర్యంలో ఐదు దశాబ్దాలుగా జిల్లా కేంద్రంలోని టౌన్ హాల్‌లో విశేష సేవలు అందించింది. అప్పటి బీఆర్ ఎస్ ప్రభుత్వం హైదారాబాద్‌లోని రవీంద్ర భారతి మాదిరిగా నల్లగొండ జిల్లా కేంద్రంలో కళాభారతి నిర్మించాలని తలపెట్టింది. అందుకు 2023, అక్టోబర్ 2న ఆర్భాటంగా అప్పటి మునిసిపల్ శాఖ మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేశారు. అదే సమయంలో అప్పటి వరకు కవులు, కళాకారులకు సేవలందించిన టౌన్‌హాల్‌ను నేల మట్టం చేశారు. ఆ స్థలంలో మునిసిపల్‌శాఖ తమ వాహనాల పార్కింగ్‌కు వినియోగించుకోంటుంది రెండేళ్ల నుంచి కవులు, కళాకారులకు సభలు, సమావేశాలు, కళా ప్రదర్శనలు నిర్వహించుకోవడానికి సరైన వేదిక లేక నానా ఇబ్బందులు పడుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటి రెండు నెలలు గడిచిన కళాభారతి నిర్మాణం పనులను మొదలు పెట్టలేదు.

### ఇబ్బందులు పడుతున్న కళాకారులు

కవులు, కళాకారులకు సాహిత్యవేదికలు లేక నానా ఇబ్బందులు పడుతున్నారు. కొన్నేళ్ల నుంచి టౌన్‌హాల్‌లో సాంస్కృతిక, సాహిత్య కార్యక్రమాలు నిర్వహించుకొనేవారు. కవులు, కళాకారులు సభలు, పుస్తకావిష్కరణ సభలు, కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించేవారు. రెండేళ్లనుంచి జిల్లా కేంద్రంలోని సాంస్కృతిక, సాహిత్య కార్యక్రమాల నిర్వహణకు వేదిక లేక పోవడంతో లయన్స్ క్లబ్, యూటీఎఫ్ భవనం, డిగ్రీకళాశాల ఆడిటోరియంలో నిర్వహిస్తే ఇబ్బంది పడుతున్నారు. కవులు, కళాకారులు కళాభారతిని త్వరగా నిర్మించాలని అనేక సార్లు ఉన్నతాధికారులకు, జిల్లా ప్రజా ప్రతి నిధులను కలిసి వినతి పత్రాలు అందజేశారు. అయినా ఇంత వరకు నిర్మాణం పనులు మొదలు కావడం లేదు.

### రూ.90.61 కోట్ల అంచనాతో శంకుస్థాపన

గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.90.61 కోట్లతో సాధారణ అభివృద్ధి నిధులతో 2023 సంవత్సరంలో కళాభారతి నిర్మించతలపెట్టింది. శంకుస్థాపన చేసి రెండేళ్ల పూర్తి కావస్తున్నా ఇంతవరకు నిర్మాణం పనులు మొదలు కాలేదు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు కళాభారతి నిర్మాణం కోసం నిధులు కూడా కేటాయించక పోవడం గమనార్హం. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా నిధులు కేటాయించి నిర్మాణ పనులను వేగవంతం చేయాలని కళాకారులు కోరుతున్నారు. నిధులు మంజూరైతే తప్ప టెండర్లను పిలిచే పరిస్థితి లేదు.

### మంత్రి కోమటిరెడ్డి చొరవ తీసుకోవాలి



రెండేళ్ల నుంచి సాంస్కృతిక, సాహిత్య కార్యక్రమాల వేదిక లేకపోవడం వల్ల ఇబ్బంది పడు తున్నాం. కవులు, కళాకారులకు నిలయమైన జిల్లా కేంద్రంలో సాంస్కృతిక భవనం లేక కళారంగానికి తీరనిలోటు. ఇప్పటికైనా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చొరవ తీసుకొని కళాభారతి పనులు మొదలు పెట్టే విధంగా కృషి చేయాలి.
-సాగర్ల సత్తయ్య, ప్రముఖ సాహితీవేత్త

### నిధులు విడుదల కాగానే నిర్మాణం

నిధులు విడుదలైన వెంటనే టెండర్లు పిలుస్తాం. ఆ తరువాత నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేస్తాం. గడియారం సెంటర్‌లోని ప్రభుత్వం స్థలంలో కళాభారతి ఆడిటోరియం నిర్మాణానికి ప్రణాళిక రూపొందించాం. త్వరలోనే పనులను ప్రారంభిస్తాం.
-సయ్యద్ ముసాబ్ అహ్మద్, మునిసిపల్ కమిషనర్ నల్లగొండ

## వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి



వెలిమినేడులో విద్యార్థులతో లెక్కలు చేయిస్తున్న డీఈఓ భిక్షపతి

చిట్యాలరూరల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): విద్యలో వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని డీఈవో బొల్లారం భిక్షపతి ఆదేశించారు. మండలంలోని వెలిమినేడు ప్రాథమిక, జడ్పీహెచ్ఎస్‌ను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆంగ్లంపై విద్యార్థులు ప్రత్యేక దృష్టిని సారించాలన్నారు. ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి విద్యార్థులచే ఆంగ్ల పాఠాలను చదివించారు. 1, 2వ తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థులతో తీసివేత లెక్కలు చేయించి అభినందించారు. జడ్పీహెచ్ఎస్‌లో 10వ తరగతి గదికి వెళ్లి విద్యార్థుల పాఠ్యాంశాల గురించి అడిగి తెలుసుకున్నారు. గణితంలోని ప్రశ్న లను విద్యార్థులను అడిగి సమాధానాలు రాబట్టారు. రానున్న వార్షిక పరీక్షల్లో ఎలాంటి భయాందోళనలు లేకుండా పరీక్షలనురాయాలన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనం పరిశీలించారు. వంటల గురించి విద్యార్థులకు అడిగి తెలుసుకున్నారు. హెచ్ఎం యానాల నర్సిరెడ్డి, పి.శ్రీనివాస్, విజయలక్ష్మి, వనజ, చంద్రకళ ఉన్నారు.

## డబుల్ బెడ్‌రూమ్ వద్ద వసతులకు శంకుస్థాపన

నార్కట్‌పల్లి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బీ.వెల్లెంల, ఔరవాణి గ్రామాల్లో నిర్మించిన డబుల్ బెడ్‌రూంల సముదాయం వద్ద మౌలిక వసతుల నిర్మాణానికి ఎమ్మెల్యే వేముల వీరేశం మంగళవారం శంకుస్థాపన చేశారు. సుమారు రూ.1.40 కోట్లతో మౌలిక వసతులను కల్పించనున్నారు. వసతులు పూర్తయ్యాక అర్హులకు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు బత్తుల ఊశయ్య, పబ్బతిరెడ్డి వెంకట్‌రెడ్డి, దూదిమెట్ల సత్తయ్య, వడ్డే భూపాల్‌రెడ్డి, పుల్లెంల అచ్చాలు, పల్లె నరేందర్‌రెడ్డి, నల్లబోతు సత్తయ్య పాల్గొన్నారు.

## సేవలకు గుర్తింపుగానే ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపిక

కేతేపల్లి, మార్చి 11(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌ను నమ్ముకుని పని చేసిన వారికి అన్యాయం జరగదనేది ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికతో మరోమారు నిరూపితమైందని నకిరేకల్ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు ఎస్‌కె.లతీఫ్, బయ్య ముత్తయ్య తెలిపారు. మండల కేంద్రం మంగళవారం వారు విలేకరులతో మాట్లాడారు. దశాబ్దకాలంగా డీసీసీ అధ్యక్షుడిగా ఉన్న కేతావత్ శంకర్‌నాయక్, టీపీసీసీ అధికార ప్రతినిధి అద్దంకి దయాకర్, తెలంగాణ ఉద్యమకారిణి, సినీనటి విజయశాంతి పార్టీకి అందించిన సేవలకు గుర్తింపుగానే వారిని పార్టీ శాసన మండలికి ఎంపిక చేసిందన్నారు. సమావేశంలో టీపీసీసీ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర కోఆర్డినేటర్ ఎ.మహేందర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ జె.లక్ష్మమ్మ, కాంగ్రెస్ నాయకులు జె.వెంకటనర్సయ్యయాదవ్, కోట పుల్లయ్య, సైదులు, సోమలింగంయాదవ్ ఉన్నారు.

## ధర్మ ప్రచార రాష్ట్ర కోశాధికారిగా ముత్యంరాజు



ముత్యం రాజు

శాలిగౌరారం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచారం సభ రాష్ట్ర కోశాధికారిగా మం డలంలోని ఉట్కూరు గ్రామానికి చెందిన రంగు ముత్యం రాజు గురుస్వామి ఎంపికయ్యారు. ముత్యంరాజు ఇప్పటి వరకు సూర్యాపేట జిల్లా అధ్యక్షుడిగా పదవి బాధ్యత నిర్వహి స్తున్నారు. ముత్యంరాజు అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ స్థాపించిన నాటి నుంచి సంస్థలో పనిచేస్తూ మొదట బ్రాంచ్ అధ్యక్షుడిగా, జిల్లా పీఆర్‌వోగా, జిల్లా అధ్య క్షుడిగా పనిచేశారు. ఆయన సేవలను గుర్తించిన రాష్ట్ర అధ్యక్షుడు టీవీ పుల్లంరాజు నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. తన ఎన్నికకు సహకరించిన రాష్ట్ర కమిటీ, జాతీయ కమిటీ సభ్యులకు ముత్యం రాజు కృతజ్ఞతలు తెలిపారు.

## పరువు హత్యలు చేసేవారికి తగిన గుణపాఠం



చిట్యాల : విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీతారాములు

చిట్యాల, మార్చి11, (ఆంధ్రజ్యోతి) : మిర్యాలగూడ ప్రణయ్ హత్య కేసులో నల్లగొండ జిల్లా కోర్టు ఇచ్చిన తీర్పు పరువు హత్యలు చేసేవారికి తగిన గుణపాఠం చెబుతుందని మాజీ ఎమ్మెల్సీ, సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతరాములు అన్నారు. చిట్యాలలో మంగళ వారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రణయ్ హంతకులకు శిక్ష పడే విధంగా కృషి చేసిన పోలీసు అధికారులు, న్యాయా ధికారులను అభినందించారు. రాష్ట్రంలో 126 పరువు హత్యలు జరిగాయని, వాటిని కూడ ప్రణయ్ కేసులాగానే చేధించాలనీ కోరారు. కులాంతర వివాహలను ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రజాసంఘాలు, ప్రజాప్రతినిదులపై, ప్రభుత్వ యంత్రాంగంపై ఉందన్నారు. సమసమాజ స్థాపన కోసం అందరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జిట్ట నగేష్, అవిశెట్టి శంకరయ్య, పట్టణ కార్యదర్శి బొబ్బల సుధాకర్‌రెడ్డి, ఐతరాజు నర్సింహ, ఐతరాజు యాదయ్య, మెట్టు నర్సింహ, పొలమాకుల అర్జున్, నలపరాజు శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## మానసిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

నకిరేకల్ , మార్చి11 (ఆంధ్రజ్యోతి) : పురుగుల మందు తాగి ఓ వ్యక్తి నకిరేకల్‌లో ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన జెటంగి లింగయ్య (45)నకిరేకల్‌లో కొంత కాలంగా కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మానసికంగా ఇబ్బందులు పడుతూ నకిరేకల్ వ్యవసాయ మార్కెట్ సమీపంలో సోమవారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడు కుమారుడు ధనుష్ పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాజశేఖర్ తెలపారు.

## చికిత్స పొందుతూ రైతు మృతి

నకిరేకల్, మార్చి 11, (ఆంధ్రజ్యోతి): ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన రైతు జిల్లా వెంకటయ్య(54) హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఈ నెల 8న నకిరేకల్ నుంచి నల్లగొండకు వెళ్తుండగా తాటికల్ ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. గా యపడిన వెంకటయ్యను హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందారు. ఆయన భార్య ఎల్లమ్మ పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాజశేఖర్ తెలిపారు.

## నీటి లభ్యత మేర పంటలు సాగు చేసుకోవాలి



జక్కలవారిగూడెంలో పొలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

మునుగోడురూరల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): రైతులు నీటి లభ్యతకు అనుగుణంగా పంటలు సాగు చేసుకోవాలని మునుగోడు వ్యవసాయ సహాయ సంచాలకుడు వేణుగోపాల్ సూచించారు. మండలంలోని జక్కలవారిగూడెంలో మంగళవారం వరి పొలాలను పరిశీలించి రైతులతో మాట్లాడుతూ చౌడు భూమిలో వరి వేసుకున్నప్పుడు జింకు లోపం వస్తుందని, ఇది వచ్చినప్పుడు పంట ఎదుగుదల తగ్గిపోయి ఇటుక రంగులోకి మారిపోయి పంట దిగుబడి గణనీయంగా తగ్గిపోతుందన్నారు. దీని నివారణకు తప్పనిసరిగా 20 కిలలో జింకును పిచికారీ చేయాలని సూచించారు. యాసంగి సీజన్‌లో బోర్ల కింద వరి సాగు చేసుకునే రైతులు నీటి లభ్యతను బట్టి ఆరుతడి పంటలైన పప్పు ధాన్యాలు, మొక్కజొన్న, ఇతర కూరగాయలు సాగు చేసు కోవాలన్నారు. రైతులు ఆయిల్‌పామ్ తోటల పెం పకం కూడా చేసుకోవాలని సూచించారు. దీనికి ప్రభుత్వం సబ్సిడీ కూడా ఇస్తుందని పూర్తి వివరాలకు సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారులు, ఉద్యానవన శాఖ అధికారిని సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో ఏవో మల్లేష్, ఏఈఓ మౌనిక, రైతు కర్నాటి ఈశ్వరయ్య పాల్గొన్నారు.

## పాఠశాల నిధుల దుర్వినియోగంపై విచారణ



పాఠశాలను పరిశీలిస్తున్న శ్రీనివాస్

నాంపల్లి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మం డలంలోని చిట్టెంపహాడ్ ప్రాథమిక పాఠశాలకు మంజూరైన అమ్మ ఆదర్శ పాఠశాల నిధులు దుర్వినియోగం జరిగినట్లు ఫిర్యాదు రావడంతో నాంపల్లి మండల ప్రత్యేకాధికారి శ్రీనివాస్ మంగళవారం పాఠశాలలో విచారణ చేపట్టారు. పాఠశాలలో నామ మాత్రంగా పనులు చేపట్టి రూ.2.72 లక్షలు డ్రా చేశారని గ్రామస్థులు ఇటీవల కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు విచారణ చేపట్టారు. పాఠశాలలో మరమ్మతులు, మూత్రశాలల నిర్మాణం, మంచినీటి సదుపాయం కోసం, ఎలక్ట్రిసిటీ పనుల కోసం రూ .6.50 లక్షలు అమ్మ ఆదర్శ పాఠ శాల నిధులు మంజూరయ్యాయి. పాఠశాలలో చేపట్టాల్సిన ఎలక్ట్రిసిటీ పనులు చేయలేదని, మంచి నీటి వసతి కల్పించాల్సి ఉండగా పాత ట్యాం కుకు నల్లా కనెక్షన్లు ఇచ్చినట్లు, మోటర్ బిగించకుండా ఇటీవల ఎలాంటి కరెంట్ కనెక్షన్, పైప్‌లైన్ కనెక్షన్ లేకుండా వాటర్ ట్యాంకులో ఒక పాత మోటర్ వేసి ఉంచినట్లు ప్రత్యేక అధికారి గుర్తించారు. కేవలం పాఠశాల చైర్మన్, హెచ్ఎం తీర్మానం మేరకే నిధులు ఎలా డ్రా చేస్తారని, సమగ్ర విచారణ చేపట్టి నిజనిర్ధారణ చేయాలని, పాఠశాలకు ప్రహరీ నిర్మాణం చేయాలని, మూత్రశాలల నిర్మాణం చేపట్టాలని ప్రజలు అధికారులను కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో మేరి స్వర్ణకుమారి, ఎంపీవో ఝాన్సీ, పంచాయతీ కార్యదర్శి శివ కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

### పాఠశాలకు సంబంధించిన తీర్మానాలు పరిశీలిస్తా: మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస్

విద్యాశాఖ నుంచి అమ్మ ఆదర్శ పాఠశాలకు సంబంధించిన తీర్మానాలను తెప్పించుకొని, నమోదు చేసిన కొలతల పుస్తకాలను పూర్తిస్థాయిలో పరిశీలించి నివేదిక జిల్లా కలెక్టర్‌కు అందిస్తామని ప్రత్యేక అధికారి శ్రీనివాస్ తెలిపారు

## గ్రామాల్లో పేరుకుపోతున్న సమస్యలు పరిష్కరించాలి

చిట్యాలరూరల్, మార్చి11 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పేరుకుపోతున్న సమస్యలను పరిష్క రించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జిట్ట నగేష్, మండల కార్యదర్శి అవిశెట్టి శంకరయ్య కోరా రు. పార్టీ ఆధ్వర్యంలో మండలంలోని వెలిమినేడు గ్రామంలో ప్రజా సమస్యలపై 4 రోజులుగా సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యలు కుప్పలుతెప్పలుగా ఉన్నా ఏమాత్రం పరిష్కారానికి నోచుకోవడంలేదు. ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయని రోజురోజుకు పేరుకుపోతున్నా ఏమాత్రం పరిష్కారం కావడం లేదన్నారు. సమస్యల పరిష్కారం చేయాలని డిమాండ్ చేస్తూ ఒక రోజు దీక్ష చేపట్టారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని పంచాయతీ కార్యదర్శి దేశబోయిన లింగస్వామికి అందజేశారు. కార్యక్రమంలో అరూరి శ్రీను, నెలికంటి నర్సింహ, మల్లం మహేష్, దేశబోయిన స్వరూపా నర్సింహ, దేశబోయిన సరస్వతి, నాతి వెంకట్రామయ్య, సుర్కంటి మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

▸▸ చిట్యాల : మున్సిపాలిటీలోని 12వ వార్డులో డ్రైనేజీ సమస్యను వెంటనే పరిష్కరించాలని సీపీఎం మండల కార్యదర్శి అవిశెట్టి శంకరయ్య డిమాండ్ చేశారు. మంగళవారం సీపీయం ఆధ్వర్యంలో వార్డులో సమస్యలపై సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైస్కూల్ వెనుక గల బోరు బావిలో మోటారు బిగించితాగు నీరందించాలనీ కోరారు. జిల్లా కమిటీ సభ్యురాలు జిట్ట సరోజ, పట్టణ కార్యదర్శి బొబ్బల సుధాకర్‌రెడ్డి, ఐతరాజు యాదయ్య, జిట్ట స్వామి, నాగయ్య పాల్గొన్నారు.

## మహిళా సాధికారతతోనే సమాజం అభివృద్ధి



మహిళా ఉపాధ్యాయులను సన్మానిస్తున్న కస్తూరి ఫౌండేషన్ సభ్యులు

చండూరు రూరల్, మార్చి11 (ఆంధ్రజ్యోతి): మహిళా సాధికారతతోనే సమాజం అభివృద్ధి చెందు తుందని కస్తూరి ఫౌండేషన్ సభ్యుడు పిన్నింటి నరేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని పుల్లెంల గ్రామంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని మంగళవారం జడ్పీ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలల ఆవరణలో మహిళా ఉపాధ్యాయులను సన్మానించారు. నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ సామాజిక అసమానతలపై పోరాడిన సహృదయశీలి భారతదేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు, రచయిత్రి సావిత్రి బాయి పూలే అని గుర్తు చేస్తూ మహిళలు ఆమె అడుగుజాడల్లో నడవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో సభ్యులు ఇరిగి శివ, ముక్కాముల రాజు, ముక్కాముల సైదులు, ఉపాధ్యాయులు రాపోలు లక్ష్మీనారాయణ, హైమావతి, కూపిరెడ్డి సువర్ణ, సునీత, సుగుణ, లక్ష్మీ ఉన్నారు.

## చేనేతలకు రుణ మాఫీపై హర్షం



సీఎం రేవంత్, ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

చండూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): చేనేతలకు రూ.లక్ష రుణమాఫీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో విడుదల చేయడంపై చేనేత పరిరక్షణ సేవా సమితి నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు చండూరు పట్ట ణంలో ప్రధాన చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి చిత్ర పటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సంద ర్భం గా మాజీ సర్పంచ్ కోడి గిరిబాబు, ట్రస్మా జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కోడి శ్రీనివాసులు మాట్లాడుతూ చేనేతల సంక్షేమం పట్ల రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. స్థానిక ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి కార్మికులకు ఆర్థిక తోడ్పాటునిస్తూ ఆదుకుంటున్నారని గుర్తు చేశారు. కార్యక్రమంలో నాయకులు కర్నాటి శ్రీనివాసులు, రాపోలు జగదీష్, జూలూరు వెంకటేశం, బొల్ల వెంకటేశం, చిట్టిప్రోలు వెంకటేశం, వర్కాల విజయ్, దూస గణేష్, సంగెపు మల్లేష్, గణపతి, గంజి గంగాధర్, అశోక్ పాల్గొన్నారు.

## తాగునీటి సమస్యల పరిష్కారానికి అత్యవసర టీమ్

చిట్యాల, మార్చి11, (ఆంధ్రజ్యోతి);వేసవికాలం దృష్ట్యా చిట్యాల మున్సిపాలిటీ పరిధిలో తాగునీటి పరిష్కారం కోసం అత్యవసర సెల్ టీమ్ ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ వీరేందర్ తెలిపారు. ఈ టీమ్ తాగునీటి సమస్యలపై సత్వరమే స్పందించి సమస్యను పరిష్కరిస్తుందన్నారు. ఈ టీమ్‌లో వివిధ వార్డులకు అధికారులను నియమించినట్లు తెలిపారు. నీటి సమస్య ఉన్నచో సంబంధిత అధికారులకు లేక సిబ్బందికి ఫోన్ చేయాలని కోరారు.

## ఎస్సీ వర్గీకరణ చట్టం త్వరగా చేయాలి



రిలే నిరాహార దీక్ష చేస్తున్న ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్ నాయకులు

నల్లగొండ క్రైం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ చట్టం త్వరగా చేయాలని, చట్టం వచ్చే వరకు పోటీ పరీక్షల ఫలితాలను వాయిదా వేయాలని కలెక్టరేట్ ఎదుట ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన రిలే నిరాహారదీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఇరిగి శ్రీశైలం మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీ సాక్షిగా మాదిగలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని కోరారు. డాక్టర్ షమీం అక్తర్ ఇచ్చిన నివేదికలో లోపాలను, న్యాయపరమైన చిక్కులు రాకుండా చూడాలని కేబినెట్ కమిటీకి చెప్తూ మరోవైపు ఉద్యోగాలు భర్తీ చేయడం మాదిగలను మోసం చేయడమే అన్నారు. ఎస్సీ వర్గీకరణ చట్టం వచ్చే వరకూ ఉద్యోగ యామకాలను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. దీక్షలను ఎమ్మార్పీఎస్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి బోడ సునీల్ మాదిగ, ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు బకరం శ్రీనివాస్, ఎంజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు గాదె రమేష్ ప్రారంభించారు. కార్యక్రమంలో బొజ్జ దేవయ్య, తరి ఏడుకొండలు, రణవీర్, కురుపాటి కమలమ్మ ఉన్నారు.

## సంక్షిప్తంగా


▸▸ నార్కట్‌పల్లి : మండలంలోని చిప్పలపల్లి గ్రామానికి చెందిన వలిగొండ శంకరయ్య భార్య పద్మ అనారోగ్యంతో ఇటీవల మృతిచెందింది. ఆమె కుటుంబం పేదరికంతో ఇబ్బంది పడుతుండటంతో ఆర్థిక సాయం చేయాలని గ్రామస్తులు సంకల్పించారు. ఇంటికి కొంత చొప్పు న వసూలు చేసిన విరాళాల మొత్తం రూ.1,15,000లను మంగళవారం అందజేశారు.

▸▸ నాంపల్లి : నేరళ్లపల్లి గ్రామానికి చెందిన పల్లె రామస్వామి అనారోగ్యంతో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఆ గ్రామ మాజీ సర్పంచ్ సయ్యద్ గఫార్ వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సహాయం రూ.10 వేలు అందజేశాడు. కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు బచ్చనబోయిన రమేష్, మదా రమేష్, యాదయ్య పాల్గొన్నారు.

▸▸ గట్టుప్పల్ : మండల కేంద్రంలో ప్రభుత్వ ఆస్పత్రి భవన నిర్మాణానికి పంచాయతీరాజ్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నాగేశ్వర్ రావు స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ప్రజలకు వైద్యం అందడానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. అందుకోసం ప్రభుత్వ ఆస్పత్రి కోసం స్థలాన్ని పరిశీలించినట్లు ఆయన తెలిపారు.

▸▸ నార్కట్‌పల్లి : మధ్యాహ్న భోజన ఏజెన్సీలకు పెండింగ్‌లో ఉన్న బిల్లులను చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పోలే సత్యనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని నార్కట్‌పల్లి, నెమ్మాని, తొండ్లాయి, అక్కెనపల్లి, శాపల్లి, అమ్మనబోలు తదితర గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలలను మంగళవారం సందర్శించి మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులతో మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ బిల్లులతో పాటు ఇతర సమస్యల పరిష్కారం కోసం ఈనెల 19న నిర్వహించే కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయాలని సత్యనారాయణ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో చింత సంగీత, బత్తిని సునీత, అండాలు, సుశీల, యాదమ్మ, అరుణ, శైలజ, నాగమ్మ, యాదమ్మ, రేణుకలు పాల్గొన్నారు.

▸▸ నార్కట్‌పల్లి : నిరంతరం ప్రజా ఉద్యమాలతో జీవితాన్ని గడిపే సీపీఐ నల్లగొండ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యానికి ఎమ్మెల్సీ గా అవకాశం కల్పించడంపై ఆ పార్టీ జిల్లా నాయకుడు లొడంగి శ్రవణ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. పొత్తు ధర్మంతో ఎమ్మెల్సీ పదవి ఇచ్చిన కాంగ్రెస్ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రకటన విడుదల చేసిన వారిలో నార్కట్‌పల్లి మండల శాఖ కార్యదర్శి పెండ్యాల శంకర్, నేతలు వెంపటి శ్రీనివాస్, సంగిశెట్టి శ్రీను, పులిసాని అనంతరెడ్డి, ఆలకుంట్ల నర్సింహ, తీగల మల్లారెడ్డి, వనం వాసుదేవులు, వంగాల నాగయ్య, తీగల పిచ్చిరెడ్డి ఉన్నారు



**హెల్ప్‌లైన్ నంబర్లు**

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ :18004251442

యాదాద్రి :1800 425 7106

సూర్యాపేట :1800 425 1972

**చికెన్ ధరలు**

గుడ్డు డజన్ ధర : 60

| జిల్లా | లైవ్ | డ్రెస్ | స్కిన్‌లెస్ |
|---|---|---|---|
| యాదాద్రి | రూ.112 | 175 | 200 |
| సూర్యాపేట | రూ.125 | 180 | 210 |
| నల్లగొండ | రూ.125 | 195 | 210 |

ఉష్ణోగ్రత గరిష్ఠం 34.0 , కనిష్ఠం 20.4

# హామీలను నెరవేర్చేనా?



- పలు పథకాలకు నిధులు సాధించాలని ప్రజల వేడుకోలు
- నిధులు వచ్చినా పనులు వేగంగా పూర్తిచేయాలని విన్నపం
- అన్ని హామీలకు ఈ ఏడాది నిధులివ్వాలని డిమాండ్లు
- నేటి నుంచి శాసనసభ బడ్జెట్ సమావేశాలు



శాసనసభ బడ్జెట్ సమావేశాలు బుధవారం ప్రారంభంకానున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వంలో కీలకంగా ఉన్న మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఎమ్మెల్యేలు ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తుండగా, ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చేలా ఈ బడ్జెట్‌లో పథకాలు, నిధులు మంజూరు చేయిస్తారని ఉమ్మడి జిల్లా ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు. సాధారణ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన స్థానిక హామీలకు కార్యరూపం ఇవ్వాలని కోరుతున్నారు. బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో గత ఎన్నికల సందర్భంగా అభ్యర్థులుగా ఉన్న ప్రస్తుత ఎమ్మెల్యేలు ఇచ్చిన ప్రధాన హామీలపై ప్రత్యేక కథనం..

- (ఆంధ్రజ్యోతి ప్రతినిధి,నల్లగొండ)

### నల్లగొండ నియోజకవర్గం



- నల్లగొండ పట్టణంలో బైపాస్‌రోడ్డు, లతీఫ్ సాబ్ గుట్ట, బ్రహ్మంగారి గుట్టపైకి వేర్వేరుగా ఘాట్ రోడ్ల నిర్మాణాలకు సంబంధించి ఇచ్చిన హామీ అమలు కోసం ఇప్పటికే నిధుల కేటాయింపు జరిగింది. ఈ పనులను వేగవంతం చేయాల్సి ఉంది.
- పానుగోడు చెరువుకు మంజూరైన ఎత్తిపోతల పథకాన్ని త్వరగా పూర్తిచేయాలని రైతులు కోరుతున్నారు.
- తిప్పర్తి మండల కేంద్రంలో పార్కు ఏర్పాటు చేయాల్సి ఉంది.
- నకిరేకల్-పర్చూరు-నల్లగొండ డబుల్ రోడ్డు నిర్మాణం చేపట్టాల్సి ఉంది.
- నిర్మాణంలో ఉన్న ఏటీసీ సెంటర్ పనులు వేగంగా పూర్తిచేయాల్సి ఉంది.

### నకిరేకల్ నియోజకవర్గం

- అమ్మనబోలు, వెలిమినేడు మండలాల ఏర్పాటు డిమాండ్ ఉంది.
- రామన్నపేట ఏరియా ఆస్పత్రి 100పడకలకు అప్‌గ్రేడ్‌కు ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.
- నకిరేకల్‌లో పలు పరిశ్రమల ఏర్పాటు, వీటి ద్వారా యువతకు ఉపాధి కల్పించాలని యువకులు కోరుతున్నారు.
- పోటీపరీక్షల నిమిత్తం విద్యార్థులకు ఉచిత కోచింగ్ సెంటర్ల ఏర్పాటు చేయాల్సి ఉంది.



ఎస్‌ఎల్‌బీసీ సొరంగమార్గం పూర్తి చేసి ఉమ్మడి జిల్లాకు సాగు, తాగునీరందించే ఎస్ఎల్‌బీసీ పథకానికి గత బడ్జెట్‌లోనూ భారీగా నిధులివ్వడంతో పాటు 2019 నుంచి నిలిచిన పనులను ఇటీవలే ప్రారంభించారు. అయితే టన్నెల్ పనుల్లో ప్రమాదం నెలకొనడంతో ప్రస్తుతం పనులు నిలిచినా, త్వరలో ప్రారంభిస్తామని మంత్రులు ప్రకటించారు. ఏఎమ్మార్పీ కింద ప్రధాన కాల్వను విస్తరించి లైనింగ్ చేపట్టాలని రైతులు కోరుతున్నారు. ఈ ప్రాజెక్టులో భాగమైన బ్రాహ్మణవెల్లంల ఎత్తిపోతల పనులు...

- మిగతా 7వ పేజీలో...



### మునుగోడు నియోజకవర్గం



- శేషిలేటి ఫీడర్ ఛానల్, వెల్మకన్నె ఫీడర్ ఛానల్ పనులు పూర్తిచేయాలని రైతులు కోరుతున్నారు.
- మునుగోడు మండల కేంద్రంలో డిగ్రీ, జూనియర్ కళాశాల ఏర్పాటు, చౌటుప్పల్‌లో డిగ్రీ, ఐటీఐ కళాశాల ఏర్పాటు చేయాలనే డిమాండ్ ఉంది.
- మునుగోడు పీహెచ్‌సీని 100 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్‌కు హామీ ఇచ్చారు.
- నియోజకవర్గవ్యాప్తంగా ఉన్న కంపెనీల్లో స్థానికులకు ఉపాధి కల్పించే అంశంపై చర్యలు తీసుకోవాల్సి ఉంది.
- రాచకొండ గుట్టల్లో సాగుచేసుకుంటున్న రైతులకు పట్టాలిప్పిస్తామనే హామీ నెరవేర్చాల్సి ఉంది.

### దేవరకొండ నియోజకవర్గం..

- ఎస్ఎల్‌బీసీ, డిండి, పెండ్లిపాకల రిజర్వాయర్లు పూర్తిచేయాల్సి ఉంది.
- పీఏపల్లి, చందంపేట మండలాల్లో గుట్టల్లో ఉన్న ప్రాంతాలకు ఎత్తిపోతల పథకాల ద్వారా నీరందించాలని స్థానికులు కోరుతున్నారు.
- దేవరకొండ ఖిల్లా, దేవరచర్ల శివాలయాలను, పెద్దమునిగల్ ప్రాంతాలను పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేయాలనే డిమాండ్ ఉంది.
- దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రిని 200 పడకలకు అప్‌గ్రేడ్ చేయించాల్సి ఉంది.



### మిర్యాలగూడ నియోజకవర్గం

- నియోజకవర్గంలో మహిళా డిగ్రీ కాలేజీ ఏర్పాటు డిమాండ్ ఎప్పటినుంచో ఉంది.
- నిర్మాణంలో ఉన్న నాలుగు ఎత్తిపోతల పథకాల పూర్తికి చర్యలు తీసుకోవాలని రైతులు వేడుకుంటున్నారు.
- పట్టణానికి నలువైపులా నాలుగు వెహికల్ అండర్‌పాస్‌ల ఏర్పాటు పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.
- నియోజకవర్గంలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటుకు యువత ఎదురుచూస్తోంది.
- గ్రామీణ రోడ్ల నిర్మాణాలకు నిధుల మంజూరు చేయాలని ప్రజలు వేడుకుంటున్నారు.



### నాగార్జునసాగర్ నియోజకవర్గం..

- హాలియాలో 30 పడకల ఆస్పత్రి ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.
- నిడమనూరులో స్టేడియం నిర్మాణం చేపట్టాల్సి ఉంది.
- నెల్లికల్లు ఎత్తిపోతల పథకాన్ని దశలవారీగా పూర్తిచేయాలని రైతులు కోరుతున్నారు.
- తిరుమమలగిరి సాగర్ మండలంలో పోడు భూములు సాగు చేస్తున్న రైతులకు పట్టాలు ఇవ్వాలనే డిమాండ్ ఏళ్లుగా ఉంది.



# పెద్దల సభలో పెరిగిన ప్రాతినిధ్యం

- మండలి చైర్మన్‌గా గుత్తా సుఖేందర్‌రెడ్డి
- కొత్తగా మరో నలుగురికి ఛాన్స్
- వీరి ఎన్నిక ఏకగ్రీవమైనట్లే
- 13న అధికారిక ప్రకటన

శాసనమండలిలో ఉమ్మడి జిల్లాకు ప్రాతినిధ్యం పెరిగింది. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీలు గా తాజాగా నలుగురికి ఒకే సమయంలో అవకాశం దక్కడంతో ఉమ్మడి జిల్లాలో ఎమ్మెల్సీల సంఖ్య ఏడుకు చేరనుంది. కొత్తగా సభ్యుల ఎన్నికను ఈనెల 13న అధికారికంగా ప్రకటించనుండగా, వీరి పదవీ కాలం ఈనెల 30నుంచి ప్రారంభమవుతుంది.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి ,నల్లగొండ)

శాసనమండలిలో ఉమ్మడి జిల్లా నుంచి ఇప్పటికే మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, పట్టభద్రుల ఎమ్మెల్సీగా తీన్మార్ మల్లన్న,స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా మంకెన కోటిరెడ్డి ఉన్నారు. తాజాగా, ఎన్నికయ్యే డాక్టర్ అద్దంకి దయాకర్ (కాంగ్రెస్), కేతావత్ శంకర్‌నాయక్ (కాంగ్రెస్), నెల్లికంటి సత్యం (సీపీఐ),దాసోజు శ్రవణ్‌కుమార్ (బీఆర్ఎస్)తో కలిపి ఈ సంఖ్య ఏడుకు చేరనుంది. ఉమ్మడి రాష్ట్రంలో శాసనమండలి పునరుద్ధరణ తర్వాత ఈ స్థాయిలో ప్రాతినిధ్యం దక్కడం ఇదే తొలిసారి. గతంలో ఉమ్మడి జిల్లా నుంచి ఒకే సందర్భంలో ఇద్దరు, ముగ్గురికి మించి ప్రాతినిధ్యం దక్కలేదు. తాజాగా, రాష్ట్ర ప్రభుత్వంలో ఉమ్మడి జిల్లా పట్టుకొనసాగుతున్న నేపథ్యంలో అనూహ్యంగా మండలిలో జిల్లా నుంచి ఒకేసారి నలుగురికి అవకాశం ఇప్పించుకోవడం ద్వారా ఉమ్మడి జిల్లా నేతలు పైచేయి సాధించారు. అటు అసెంబ్లీలో, ఇటు మండలిలో కీలకనేతలు ప్రాతినిధ్యం వహిస్తున్న నేపథ్యంలో జిల్లాకు అదే స్థాయిలో నిధులు సాధిస్తారని, అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ సారించి ముందుకు నడిపిస్తారని ఉమ్మడి జిల్లా వాసులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

### ఎమ్మెల్యే కోటా నుంచే ఐదుగురికి చాన్స్

ఉమ్మడి జిల్లా నుంచి శాసనమండలిలో ప్రాతినిధ్యం వహిస్తున్న ఏడుగురిలో ఐదుగురు ఎమ్మెల్యే కోటా నుంచే ఎన్నికయ్యారు. మండలి చైర్మన్‌గా వ్యవహరిస్తున్న గుత్తా సుఖేందర్‌రెడ్డి 2019, ఆగస్టు 19న మొదటిసారి, 2021 నవంబరు 22న రెండోసారి ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. 2019 సెప్టెంబరు 11 నుంచి మండలి చైర్మన్‌గా ఆయన కొనసాగుతున్నారు. స్థానిక సంస్థల కోటా నుంచి ఎమ్మెల్సీగా గెలిచిన మంకెన కోటిరెడ్డి (బీఆర్ఎస్) 2022 జనవరి....

- మిగతా 7వ పేజీలో...

• యాదగిరీశుడి బ్రహ్మోత్సవాలు పరిసమాప్తం



యాదగిరీశుడి బ్రహ్మోత్సవాల ముగింపులో భాగంగా పూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకులు, పాల్గొన్న ఆలయ ఈవో భాస్కర్‌రావు

•7లో..

# ఎస్సీ, ఎస్టీలపై దాడులను నివారించాలి

- ప్రతీ నెల పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించాలి
- రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

నల్లగొండ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): షెడ్యూల్డ్ కులాలు, తెగలపై దాడులు నివారించాలని, అంటరానితనాన్ని అరికట్టేందుకు ప్రతీ నెల చివరి వారంలో పౌరహక్కుల దినోత్సవాన్ని తప్పనిసరిగా నిర్వహించాలని, ప్రతీ మూడు నెలలకోసారి జిల్లా స్థాయి ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేయాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీల భూములకు సంబంధించి తొమ్మిది కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, వీటిపై ఈ నెల 31లోగా నివేదిక అందజేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠిని ఆదేశించారు. అలాగే ఎస్సీ, ఎస్టీలపై దాడులకు సంబంధించి 17 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, వీటి నివేదికలు పంపించాలని ఎస్పీని ఆదేశించగా, ఎస్పీ శరత్‌చంద్ర పవర్ మాట్లాడుతూ, 12 కేసులకు ఇదివరకు నివేదికలు పంపించామని, ఐదు కేసులకు సంబంధించి నివేదికలు పెండింగ్‌లో ఉన్నాయని, కమిషన్ ఆదేశాల మేరకు నిర్దేశించిన సమయంలో నివేదికలు పంపిస్తామన్నారు. 37 కేసుల్లో చార్జిషీట్ ఇంకా దాఖలు చేయలేదని, సకాలంలో దాఖలు చేయకపోతే లబ్ధిదారులు నష్టపోవాల్సి వస్తుందని, వెంటనే చార్జిషీట్ దాఖలు చేయాలని చైర్మన్ ఆదేశించారు. పరిహారం ఇచ్చే విషయంలో ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తెస్తే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో దేవాలయ ప్రవేశం, అంటరానితనం, ఎస్సీ, ఎస్టీలపై దాడుల నివారణకు ప్రతీ నెల చివర పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించాలన్నారు. అందుకు ఎస్ఐలు, తహసీల్దార్లు సంవత్సరానికి సంబంధించి కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలన్నారు. అలాగే జిల్లాస్థాయి విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశాలు నిర్వహించాలని, దీనికి సంబంధించిన సమాచారం వారం రోజుల ముందే కమిషన్ దృష్టికి తీసుకువస్తే తానుగానీ, ఇతర సభ్యులుగానీ హాజరవుతారని తెలిపారు. ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీల ఏర్పాటులో ఎస్సీ, ఎస్టీలను ప్రోత్సహించాలని, సబ్ ప్లాన్ అమలు విషయంలో ఎవరైనా లక్ష్మణ రేఖ దాటితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎంపీ నిధులు, సీడీపీ తదితర అన్ని నిధుల్లో వాటా తప్పనిసరిగా అందేలా చూడాలన్నారు. ఉపాధి హామీ నిధులు కూడా ఎస్సీ, ఎస్టీలకు వినియోగించాలని, ఈ నెల 31లోగా ఉపాధి హామీ పనులకు సంబంధించిన పనులను వేగవంతం చేయాలన్నారు. పదోన్నతుల విషయంలో రూల్ ఆఫ్ రిజర్వేషన్ తప్పనిసరిగా అమలు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో కమిషన్ సభ్యులు కుస్రం నీలాదేవి, రాంబాబు నాయక్, కొంకతి లక్ష్మీనారాయణ, జిల్లా శంకర్, జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి సంక్షేమ ఇన్‌చార్జి అధికారి, పరిశ్రమలశాఖ మేనేజర్ కోటేశ్వరరావు, గిరిజన సంక్షేమాధికారి, గృహనిర్మాణశాఖ పీడీ రాజ్‌కుమార్, ఇన్‌చార్జి డీఆర్‌వో అశోక్‌రెడ్డి, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్, దేవరకొండ ఏఎస్పీ మౌనిక, ఎస్సీ, ఎస్టీ కోర్టు అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ అఖిల తదితరులు పాల్గొన్నారు. ప్రణయ్ హత్య కేసులో వాదనలను వినిపించి నిందితులకు శిక్షపడేలా చేసిన న్యాయమూర్తి దర్శనం నర్సింహను ఈ సందర్భంగా చైర్మన్, సభ్యులు సన్మానించారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, చిత్రంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్

# పెండింగ్ కేసులు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

- అక్రమ కార్యకలాపాలపై దృష్టి సారించాలి
- ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ క్రైం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న కేసులను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీ శరత్ చంద్ర పవార్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన నెలవారీ నేర సమీక్షలో ఆయన మాట్లాడారు. పెండింగ్ కేసుల సంఖ్యను తగ్గించేందుకు ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతీ కేసు విచారణ పారదర్శకంగా ఉండాలన్నారు. కేసు నమోదు నుంచి చార్జిషీట్ వరకూ ప్రతి విషయాన్ని కూలంకషంగా పరిశోధన చేయాలన్నారు. అవసరమైతే సంబంధిత న్యాయమూర్తులను స్వయంగా కలిసి కేసుల పరిష్కారానికి మరింత చొరవ చూపాలన్నారు. పెండింగ్ కేసులపై నిరంతర పర్యవేక్షణ ఉంటుందన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుంటూ సమర్థ సేవలు అందజేయాలన్నారు. కమ్యూనిటీ పోలీసింగ్ ద్వారా గ్రామాల్లో సీసీటీవీ కెమెరాల ఏర్పాటుకు కృషి చేయాలన్నారు. సీసీ కెమెరాల ప్రాధాన్యాన్ని ప్రజలకు వివరించి స్వచ్ఛందంగా ఏర్పాటు చేసేలా ప్రోత్సహించాలన్నారు. వివిధ రకాల ఆన్‌లైన్ మోసాల నేపథ్యంలో డయల్ 100 వినియోగంపై విద్యార్థులు, ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతీ రోజూ డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించాలని సూచించారు. దొంగతనాలు జరగకుండా పెట్రోలింగ్ పెంచాలని, పాత నేరస్థుల కదలికలపై నిఘా పెట్టాలన్నారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం తాగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలు, గంజాయి, జూదం, ఇసుక, పీడీఎస్ రైస్ రవాణాపై ప్రత్యేక దృష్టి సారించి అరికట్టాలన్నారు. సమావేశంలో ఏఎస్పీ మౌనిక, ఎస్బీ డీఎస్పీ రమేష్, డీటీసీ డీఎస్పీ విఠల్‌రెడ్డి, డీఎస్పీలు కొలను శివరాంరెడ్డి, రాజశేఖరరాజు, డీసీఆర్‌డీ డీఎస్పీ సైదా, పాల్గొన్నారు.

# సాగునీటికి ఎలాంటి ఇబ్బంది లేదు

- రైతులు ఆందోళన చెందవద్దు
- కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రాజెక్టుల కింద సాగు చేస్తున్న పంటలకు సాగు నీరు అందించడంలో ఎలాంటి ఇబ్బంది లేదని, ఈ విషయంలో రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కలెక్టర్ ఇలా త్రిపాఠి స్పష్టం చేశారు. బుధవారం పానగల్ సమీపంలోని ఉదయ సముద్రం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌ను ఇరిగేషన్, రెవెన్యూ, వ్యవసాయశాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యాసంగిలో సాగులో ఉన్న పంటలకు సాగునీరు అందడం లేదని వస్తున్న దుష్ప్రచారాలను నమ్మవద్దని, రైతులను తప్పుదోవ పట్టించేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు, ఉదయ సముద్రం ప్రాజెక్టుల కింద ప్రస్తుతం సాగులో ఉన్న పంటలకు ఎలాంటి నీటి కొరతలేదని ఆమె స్పష్టం చేశారు. ఉదయ సముద్రం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో 1.5టీఎంసీల నీటికి 0.86 టీఎంసీల నీటిని విడుదల చేస్తామని, ప్రాజెక్టు కింద ఉన్న 6,700 ఎకరాలకు వారబంధీ విధానంలో పంట కోత వచ్చేవరకు నీటిని అందిస్తామన్నారు. ఉదయసముద్రం డీ-40 కింద ఉన్న 11-ఎల్ డిస్ట్రిబ్యూటరీ కెనాల్‌ను కలెక్టర్ పరిశీలించి మాట్లాడుతూ 11-ఎల్ కింద ఉన్న మామిడాల, సర్వారం, ఇందుగుల, గోరింకలపల్లి గ్రామాలన్నింటికీ వారబంధీ ద్వారా నీరు అందుతోందన్నారు. ఆయకట్టు చివరి భూములకు సైతం సాగునీరు అందిస్తామన్నారు. ఫిబ్రవరి నుంచి ఎండలు తీవ్రమైన దృష్ట్యా కొంతవరకు ప్రాజెక్టుల్లో నీరు తగ్గిన మాట వాస్తవమని, అయితే ఉదయసముద్రంకు సాగునీటిని విడుదల చేసిన తర్వాత 30శాతం భూగర్భ జలాలు పెరిగాయన్నారు. అన్ని మండల వ్యవసాయాధికారుల కార్యాలయాల్లో ఫిర్యాదుల విభాగాలను ఏర్పాటు చేశామని, ఏవైనా సమస్యలు ఏర్పడితే ఫిర్యాదు చేయాలన్నారు. తక్షణమే సం బంధిత శాఖల అధికారులు వాటిని పరిష్కరిస్తారన్నారు. నకిరేకల్, మునుగోడు, నల్లగొండ నియోజకవర్గాల్లో కాల్వల కింద సాగు చేసే భూములకు ఎలాంటి నీటి కొరతలేదని, 10రోజుల్లో ఇక్కడ కోతలు కూడా పూర్తవుతాయన్నారు. దేవరకొండ, మిర్యాలగూడలో వేరుశనగ పంటలు ఆలస్యంగా సాగు చేశారని, అక్కడ కూడా పంటలు ఎండిపోకుండా తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఆమె వెంట జిల్లా వ్యవసాయాధికారి శ్రవణ్, ఈఈ శ్రీనివాస్‌రెడ్డి, ఉన్నారు.



అధికారులతో కలిసి ఉదయసముద్రం ప్రాజెక్టును పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

## ఉమ్మడి జిల్లాలో పలువురు సీఐల బదిలీ

నల్లగొండ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో పలువురు సీఐలను బదిలీ చేస్తూ మల్టీజోన్-2 ఐజీ వి.సత్యనారాయణ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. మహబూబ్‌నగర్ జిల్లాలో పోస్టింగ్ కోసం వెయిటింగ్‌లో ఉన్న కే.ఆదిరెడ్డిని నల్లగొండ జిల్లా నాంపల్లి సీఐగా నియమించారు. నాంపల్లిలో పనిచేస్తున్న అనంతు నవీన్‌కుమార్‌ను హైదరాబాద్ సిటీ కమిషనరేట్‌కు బదిలీ చేశారు. నల్లగొండ ట్రాఫిక్ సీఐగా ఉన్న డి.రాజును చండూరు సీఐగా బదిలీ చేశారు. చండూరు సీఐగా ఇప్పటి వరకు ఉన్న ఏ.వెంకటయ్యను హైదరాబాద్ కమిషనరేట్‌కు బదిలీ చేశారు. నల్లగొండ వీసీఆర్ సీఐగా ఉన్న కె.శివశంకర్‌ను కోదాడ సీఐగా బదిలీ చేశారు. కోదాడ సీఐగా ఉన్న టి.రామును హైదరాబాద్ కమిషనరేట్‌కు బదిలీ చేశారు.

ఉపాధి హామీ పనులు కల్పించని సిబ్బందిపై

# చర్యలు తీసుకోవాలి



ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న నారీ ఐలయ్య

మునుగోడు రూరల్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో పనులు కల్పించని సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి నారీ ఐలయ్య డిమాండ్ చేశారు. మండలంలోని కల్వకుంట్లలో ఉపాధి హామీ పనులను మంగళవారం పరిశీలించారు. జిల్లావ్యాప్తంగా ఉపాధి హామీ పనులను ఎక్కువ గ్రామాల్లో కల్పించడం లేదని, వలసలు నివారించడానికి వచ్చిన ఈ చట్టాన్ని సరిగా అమలు చేయని అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలోని ఉపాధి కూలీల పైన కక్ష సాధింపు ధోరణితో వ్యవహరిస్తోందన్నారు. కొన్ని పనులే చేయాలని ప్రభుత్వం ఆంక్షలు పెట్టడం సరికాదన్నారు. కూలీలు అడిగిన పనులు కల్పించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ప్రతి కుటుంబానికి 200రోజులు పని దినాలు కల్పించి పెరుగుతున్న ధరలకు అనుగుణంగా రూ.800ల కూలి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర నాయకుడు బండా శ్రీశైలం, ఫీల్డ్ అసిస్టెంట్ పరమేష్, నాయకులు సింగపంగా ఎల్లయ్య, కట్టా ఎల్లమ్మ, పగిళ్ల మల్లేష్, సింగపంగా సుగుణమ్మ, చిలుకూరి చిన్న యాదమ్మ, చేకూరి కావ్య, పులకరం కనకమ్మ పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ***
మిర్యాలగూడ
నాగార్జునసాగర్, దేవరకొండ


## 'ఆదర్శ'లో ప్రవేశాలకు గడువు పొడిగింపు

నిడమనూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో 6,7,8,9,10వ తరగతుల్లో 2025-26 విద్యా సంవత్సరానికి మిగిలి ఉన్న సీట్లలో ప్రవేశాల కోసం దరఖాస్తుల గడువును ఈనెల 20 వరకు పొడిగించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ బూరుగు నిర్మల మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జనరల్ కేటగిరి విద్యార్థులు రూ.200, బీసీ, ఎస్టీ, ఎస్సీ, పీహెచ్‌సీ విద్యార్థులు రూ.125 ఆన్‌లైన్‌లో చెల్లించి దరఖాస్తులు చేసుకోవాలని ఆమె సూచించారు.

## వన్‌టౌన్ సీఐగా మోతీరాం బాధ్యతల స్వీకరణ



మిర్యాలగూడ అర్బన్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): మిర్యాలగూడ వన్‌టౌన్ సీఐగా మోతీరాం మంగళవారం బాధ్యతలు చేపట్టారు. కొన్ని నెలలుగా ఈ పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వో పోస్టుఖాళీగా ఉండగా ఈనెల 7వతేదీన మల్టీజోన్-2 ఐజీ కార్యాలయం నుంచి వెలువడిన బదిలీ ఉత్తర్వుల్లో భాగంగా సీసీఎస్ విభాగంలో పనిచేస్తున్న చింత మోతీరాంకు మిర్యాలగూడ వన్‌టౌన్ సీఐ బాధ్యతలు అప్పగించగా విధుల్లో చేరారు.

# ఆట, పాటలతో చైతన్యం

● జానపద, కళారంగంపై మమకారం ● బుల్లితెర నటుడిగా రాణిస్తున్న పెంటోజీ



ప్రజలను చైతన్య పరుస్తూ కళా ప్రదర్శనలు ఇస్తున్న పెంటోజీ



దేవరకొండ, మార్చి 11(ఆంధ్రజ్యోతి): దేవరకొండ పట్టణానికి చెందిన డబ్బీకర్ పెంటోజీ చిన్నప్పటి నుంచి జానపద రంగంపై ఆసక్తి పెంచుకున్నాడు. జానపద కళాకారుడిగా ఆటలు, పాటలు పాడేవాడు. మొదట ఆకాశవాణి రేడియోలో పాటలు పాడి కళాకారుడిగా గుర్తింపు సాధించాడు. దేవరకొండకు చెందిన డబ్బీకర్ ఎల్లోజి, జమునబాయిల కుమారుడైన పెంటోజీ తల్లిదండ్రులు గ్రామాల్లో జానపద గీతాలు ఆలపించేవారు. డిగ్రీ వరకు చదువుకున్న పెంటోజీ ఆర్టీసీ డ్రైవర్‌గా దేవరకొండ, నల్లగొండ, ఇబ్రహీంపట్నం, కాచిగూడ డిపోల్లో పనిచేసి ఉద్యోగ విరమణ చేశారు. 1991 నుంచి దేవరకొండ నియోజకవర్గంలో శిశు విక్రయాలు, భ్రూణహత్యలు, ఫ్లోరోసిస్, ప్లాస్టిక్ భూతాన్ని తరిమికొట్టాలని జానపద గీతాలు, ఆట, పాటల ద్వారా ప్రజలను చైతన్యపరిచారు. దేవరకొండ డివిజన్‌లో యురేనియం తవ్వకాలకు వ్యతిరేకంగా పెంటోజీ ఆట, పాటల ద్వారా తనదైన శైలిలో ప్రజలను చైతన్యపరిచి తీవ్రంగా వ్యతిరేకించారు. యురేనియం తవ్వకాలపై నల్లమల, అమ్రాబాద్, దేవరకొండ, పెద్దగట్టు ప్రాంతాల్లో పాటలతో ప్రజలకు వివరించి చైతన్యపరిచారు. ఆర్టీసీలో ఉద్యోగిగా పనిచేస్తూనే ఆర్టీసీ పరిరక్షణకు కళారూపం ద్వారా ప్రదర్శనలు ఇచ్చారు. దూరదర్శన్, ఆకాశవాణి నుంచి బీహైగ్రేడ్ ఉత్తీర్ణత సాధించారు. తెలంగాణ భాష, సాంస్కృతికశాఖ నిర్వహించిన గ్రామీణ కళాజ్యోతి జీవిత సాఫల్య అవార్డు, 2015లో జ్యోతిరావుపూలే అవార్డు, 2021లో ఎస్పీ బాలసుబ్రమణ్యం స్మారక అవార్డు అందుకున్నారు.

# పోదాం.. జన జాతరకు

● జాతరకు పార్వతీ రామలింగేశ్వరాలయం ముస్తాబు ● గోధుమ పిండితో శివలింగం ● నేటి నుంచి మూడు రోజుల పాటు ఉత్సవాలు

వేములపల్లి, మార్చి 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆమనగల్లు గ్రామంలో గల పార్వతీ రామలింగేశ్వరస్వామి ఆలయానికి శతాబ్దాల చరిత్ర ఉంది. ఈ ఆలయాన్ని కాకతీయ గణపతి దేవుడికి సామంతులుగా కొనసాగిన రేచర్ల రెడ్డి రాజులు నిర్మించినట్లు చారిత్రక శాసనాలు చెబుతున్నాయి. నేటికీ ఆలయ పరిసరాల్లో వాటి ఆనవాళ్లు ఉండడం వైభవానికి నిదర్శనంగా నిలుస్తున్నాయి. ఎంతో విశిష్టితగల ఈ ఆలయంలో ప్రతి సంవత్సరం మాదిరిగానే హోలీ పండుగకు ముందు మూడు రోజుల పాటు స్వామివారి కల్యాణోత్సవాలను వైభవంగా నిర్వహించి, చివరి రోజు అగ్నిగుండాల ప్రవేశంతో ఉత్సవాలను ముగించడం ఆనవాయితీ. బుధవారం స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని జాతర, క్రీడా పోటీలను ప్రారంభిస్తారని ఆలయ చైర్మన్ తాళ్ల వెంకటేశ్వర్లు తెలిపారు. జాతరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆయన తెలిపారు. ఉత్సవాలకు రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి భారీగా భక్తులు తరలివస్తారని పేర్కొన్నారు.



పార్వతీ రామలింగేశ్వరస్వామి ఆలయం

### మూడు రోజుల పాటు ఉత్సవాలు

ఆమనగల్లు గ్రామంలోని పార్వతీరామలింగేశ్వర ఆలయంలో కల్యాణం సందర్భంగా మూడు రోజుల పాటు ప్రత్యేక ఉత్సవాలు నిర్వహిస్తారు. ఈ ఉత్సవాల్లో భాగంగా గణపతి పూజ, రుద్రాభిషేకం, 13న గణపతిపూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, ధ్వజారోహణం, అంకురార్పణ, తెల్లవారుజామున 4గంటలకు(శుక్రవారం) స్వామివారి కల్యాణం, 14న తెల్లవారుజామున 4గంటలకు(శనివారం) అగ్నిగుండాలు నిర్వహిస్తారు. 15న ఆలయ సమీపంలోని భద్రకాళి అమ్మవారికి బోనాల సమర్పిం చడంతో ఉత్సవాలు ముగుస్తాయని ఆలయ చైర్మన్ తాళ్ల వెంకటేశ్వర్లు, పూజారి రెంటా మణిశర్మ తెలిపారు.

### రాష్ట్ర, జిల్లాస్థాయి క్రీడాపోటీలు

రామలింగేశ్వర స్వామి కల్యాణోత్సవాల్లో సందర్భంగా ప్రతి సంవత్సరం మాదిరిగానే రాష్ట్ర, జిల్లాస్థాయి క్రీడా పోటీలను నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇందులో భాగంగా రాష్ట్రస్థాయి ఎడ్ల పందాలు, కబడ్డీ పోటీలు, జిల్లా స్థాయి కోలాట, డప్పు పోటీలను ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి బుధవారం ప్రారంభిస్తారు.



## విద్యుత్ డీఈ శ్రీనివాస సుధీర్‌కుమార్ బదిలీ



మిర్యాలగూడ అర్బన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మిర్యా లగూడ విద్యుత్‌శాఖ డీఈ శ్రీనివాస సుధీర్‌కుమార్‌ను బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. ఐదునెలల క్రితమే బాధ్యతలు స్వీకరించిన ఆయన బదిలీ చేయడానికి యూనియన్ల ఆధిపత్యపోరు ప్రధాన కారణంగా ఉద్యోగులు భావిస్తున్నారు. ఇటీవల సిబ్బంది ప్రమోషన్ల విషయంలో సరైన నిర్ణయం తీసుకోలేదని కొన్ని సంఘాలు ఆందోళనకు దిగి ఉన్నతాధికారులకు పరస్పరం ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులు ప్రస్తుతం డీఈగా పనిచేస్తున్న శ్రీనివాస సుధీర్‌కుమార్‌ను యాదాద్రి భువనగిరి ఎస్ఈ కార్యాలయానికి బదిలీ చేయగా, అక్కడ పనిచేస్తున్న శ్రీనివాసచారికి మిర్యాలగూడ డీఈ బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. నూతనంగా నియమితులైన శ్రీనివాసచారి నేడో, రేపో విధుల్లో చేరనున్నారు.

## ఇంట్లో చోరీ

దేవరకొండ, మార్చి 11(ఆంధ్రజ్యోతి): దేవరకొండ మండలం శేరిపల్లి గ్రామానికి చెందిన జక్కుల పెద్ద వెంకటమ్మ ఇంట్లో ఇంటి తాళాలు పగలగొట్టి దొంగలు పట్టపగలు మంగళవారం చోరీకి పాల్పడ్డారు. వెంకటమ్మ కుటుంబ సభ్యులు వ్యవసాయ పనుల కోసం ఇంటికి తాళంవేసి పొలానికి వెళ్లారు. గమనించిన దొంగలు ఇంటి తాళాలు పగలగొట్టి బీరువాలో ఉన్న పావుతులం బంగారం, 25 తులాల వెండి అపహరించారు. పొలానికి వెళ్లి ఇంటి వచ్చి చూడగా దొంగతనం జరిగిందని తెలుసుకున్న వెంకటమ్మ కుటుంబ సభ్యులు దేవరకొండ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు దేవరకొండ సీఐ నర్సింహులు తెలిపారు.

## ఎల్‌ఆర్‌ఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలి

మిర్యాలగూడ టౌన్, మార్చి 11(ఆంధ్ర జ్యోతి): ఎల్‌ఆర్‌ఎస్‌ను సద్వినియోగం చేసుకో వాలని మునిసిపల్ కమిషనర్ ఎండీ. యూసుఫ్ కోరారు. లైసెన్స్‌డ్ సివిల్ ఇంజ నీర్లు, డాక్యుమెంట్ రైటర్స్, ప్రైవేట్ సర్వేయర్స్‌తో మంగళవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. అక్రమ వెంచర్లలో భూమి కొనుగోలు చేసిన యజమానులు తమ ప్లాట్లను రెగ్యులరైజ్ చేసుకునేందుకు ప్రభుత్వం కల్పించిన అవకాశమే ఎల్‌ఆర్‌ఎస్ పథకమన్నారు. నిర్ధారించిన ఫీజును మార్చి 31లోపు చెల్లిస్తే 25శాతం రాయితీ వర్తిస్తుంద న్నారు. సబ్ రిజిస్ట్రార్ బలరాంయాదవ్ మాట్లాడుతూ ప్రభుత్వ అనుమతి పొందని వెంచర్లలో భూమి కొనుగోలు చేసిన వారందకూ తమ ప్లాట్లను క్రమ బద్ధీకరించుకోవాలని సూచించారు. ప్రభుత్వం రాయితీ ప్రకటించిన నేపథ్యంలో దరఖాస్తుదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో టీపీఎస్ అంజయ్య, ఇంజనీర్లు శ్రీనివాస్, మల్లారెడ్డి, సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

## ప్రభుత్వ భవనాలను పూర్తిచేయాలి

మిర్యాలగూడ రూరల్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని తడకమళ్ల గ్రామంలో అసంపూర్తిగా ఉన్న ఎస్సీ కమ్యూనిటీహాల్, గ్రామపంచాయతీ భవనం, హెల్త్ సెంటర్ భవనాలను పూర్తిచేయాలని సీపీఎం మండల కార్యదర్శి రవినాయక్ డిమాండ్ చేశారు. పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజాపోరుబాట కార్యక్రమంలో భాగంగా తడకమళ్ల గ్రామంలో మంగళవారం సర్వే నిర్వహించారు. గ్రామంలో ప్రభుత్వ భవనాలను నిర్మించకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులు గ్రామంలో పర్యటించి భవనాలను వెంటనే పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామంలో రోడ్లు గుంతలమయంగా ఉన్నాయని అధికారులు స్పందించి రోడ్లకు మరమ్మతులు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నగేష్, చినగాని సైదమ్మ, మాజీ సర్పంచ్ వెంకట మ్మ, అశోక్, శ్రీను, వెంకటయ్య, సైదులు, సోమయ్య పాల్గొన్నారు.

## 'స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలి'

డిండి, మార్చి 11(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు అన్ని విధాలుగా తోడ్పాటునందించేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని కందుకూరు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కర్నారెడ్డి అన్నారు. పాఠశాలలో చదువుతున్న 92మంది విద్యార్థులకు, ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న 105 మంది విద్యార్థులకు శిక్ష స్కూల్ కిట్స్‌తో కూడిన బ్యాగులను జేఎస్‌డబ్ల్యూ ఎనర్జీ, సంకల్ప్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు అందజేశారు. విద్యార్థులకు జేఎస్‌డబ్ల్యూ ఆర్థిక సహకారంతో సంకల్ప్ స్వచ్ఛంద సంస్థ సౌజన్యంతో ఉభయ పాఠశాలలకు చెందిన 197 మంది విద్యార్థులకు స్కూల్ బ్యాగులు అందజేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో జేఎస్‌డబ్ల్యూ ఎనర్జీ సీఎస్ఆర్ సంతోష్, ఫౌలిమా, కేవీ నారాయణరెడ్డి, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం శ్రీనయ్య పాల్గొన్నారు.

## ఆధ్యాత్మిక చింతన కలిగిఉండాలి



పూజల్లో పాల్గొన్న సీఎల్పీ మాజీ నాయకుడు జానారెడ్డి

నిడమనూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మికతతో చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని సీఎల్పీ మాజీ నాయకుడు కుందూరు జానారెడ్డి అన్నారు. మండలంలోని ముప్పారం గ్రామంలో నిర్వహిస్తున్న వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో మంగళవారం పాల్గొన్నారు. ఆయనకు వేద పండితులు, ఆలయ నిర్వాహకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఉత్సవాల్లో పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా జానారెడ్డి మాట్లాడుతూ ముప్పారం గ్రామ అభివృద్ధితో పాటు ఆలయ అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గ్రామంలోని రహదారులు, విద్యుత్ తదితర సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ యడవెల్లి విజయ్‌కుమార్‌రెడ్డి, నాయకులు కర్నాటి లింగారెడ్డి, మేరెడ్డి వెంకట్‌రాహుల్, అంకతి సత్యం, మారుపాక వెంకట్‌రెడ్డి, కొండా శ్రీనివాస్‌రెడ్డి, నర్సింగు విజయ్‌కుమార్, శివమారయ్య, మేరెడ్డి వెంకటరమణ, ఆలంపల్లి షైనయ్య, ఆలంపల్లి కృష్ణ, చర్క శ్రీను, కంచి పాపయ్య, కోట్ల సైదులు, దారం నాగార్జున, ఆలంపల్లి ప్రసాద్, గనపురం సత్యనారాయణ, మర్రి శ్రీను, పున్నయ్య, వీరేశం, గంగాధర్, దోసకాయల వెంకన్న, దారం యాదగిరి, కంచి రవి, మల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

## ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

దేవరకొండ, మార్చి 11(ఆంధ్రజ్యోతి): దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. పీఏపల్లి మండల కేంద్రంలో ఈ నెల 16 నుంచి 17వరకు నిర్వహించనున్న లింగమంతుల స్వామి బ్రహోత్సవాల వాల్‌పోస్టర్‌ను దేవరకొండలోని తన క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో ఆనందోత్సవాలతో పండుగలు జరుపుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్లమెంట్ కోఆర్డినేటర్ సిరాజ్‌ఖాన్, పీఏపల్లి మాజీ ఎంపీపీ తేర సత్యంరెడ్డి, తేర మణిపాల్‌రెడ్డి, సైదమ్మ, శ్రీనివాస్‌యాదవ్, కొండల్‌యాదవ్, ఎల్లేష్‌యాదవ్, పిల్లి కృష్ణయ్య యాదవ్, అన్వేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



జాతర పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

## లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం : ఎమ్మెల్యే



వందరోజుల భోజన పథకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బీఎల్ఆర్

మిర్యాలగూడ టౌన్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ సేవలు ఆదర్శనీయమని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. రైస్ మిల్లర్స్ లయన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో మేరెడ్డి రాంచంద్రారెడ్డి స్మారక గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన వంద రోజుల మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య, ఆరోగ్య సేవలందించడంలో లయన్స్ క్లబ్ ముందుంటుందన్నారు. స్వచ్ఛంద సంస్థలు లయన్స్‌క్లబ్‌ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అనంతరం భోజన ఏర్పాటుకు ముందుకు వచ్చిన దాతలను అభినందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాజు, కర్నాటి రమేష్, మొక్కపాటి వెంకటేశ్వర్లు, గుడిపాటి శ్రీనివాస్, నాయుడు, విజయభాస్కర్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ అభ్యర్థిగా శంకర్‌నాయక్‌ను ప్రకటించడం హర్షణీయం

దామరచర్ల, మార్చి 11(ఆంధ్రజ్యోతి): డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్‌ను కాంగ్రెస్ అధిష్ఠానం ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రకటించడం హర్షణీయమని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాజుల శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ఎంపీపీగా, జడ్పీటీసీగా, డీసీసీ అధ్యక్షుడిగా పార్టీ కోసం కష్టపడి పనిచేసిన శంకర్‌నాయక్ సేవలను గుర్తించిన అధిష్ఠానం ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రకటించడం గొప్ప విషయమన్నారు. శంకర్ నాయక్‌కు ఎమ్మెల్సీ అభ్యర్థిత్వానికి కృషి చేసిన పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి పగిడి జీడయ్యయాదవ్, కొమ్ము దాసు, తాళ్లపల్లి విజయ్, మాలోతు జనార్ధన్ నాయక్, అజ్మీరాలింగానాయక్, ధీరావత్ నెహ్రూ నాయక్, అల్లం నాగరాజు, బత్తుల శ్రీనివాస్, వసంత్, సద్దాం, సయ్యద్‌ఖాదర్ పాల్గొన్నారు.

## ఆరు క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



డిండి, మార్చి 11 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని చెర్కుపల్లి గ్రామంలో ఓ ఇంట్లో అక్రమంగా నిల్వ చేసిన ఆరు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని రెవెన్యూ అధికారులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. డీటీసీఎస్ హనుమంతు శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం చెర్కుపల్లి గ్రామానికి చెందిన బోయిని రమేష్ తన నివాసగృహంలో ఆరు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని నిలువ చేశాడు. పక్కా సమాచారంతో తనిఖీ చేసిన అధికారులు బియ్యాన్ని స్వాధీనం చేసుకుని రేషన్ డీలర్‌కు అప్పగించారు.

## ఉచిత వైద్య శిబిరం అభినందనీయం



కనకాల్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ కోటిరెడ్డి

తిరుమలగిరి(సాగర్), మార్చి 11(ఆంధ్రజ్యోతి): పేద ప్రజల కోసం ఉచితంగా వైద్య శిబిరం నిర్వహించడం అభినందనీయమని ఎమ్మెల్సీ ఎంసీ. కోటిరెడ్డి అన్నారు. మండలకేంద్రంలో మంగళవారం నిర్వహించిన మాజీ సర్పంచ్ శాగం కనకాల్‌రెడ్డి 13వ వర్ధంతిలో సందర్భంగా నిర్వహించిన వైద్య శిబిరంలో పాల్గొన్నారు. సర్పంచ్‌గా తిరుమలగిరి గ్రామానికి కనకాల్‌రెడ్డి ఎంతో సేవ చేశారన్నారు. పేద ప్రజలకు సాయం చేయడంలో ఎప్పుడూ ముందుండేవారని గుర్తు చేశారు. వైద్య శిబిరం నిర్వాహకుడు శాగం లింగారెడ్డిని అభినందించారు. అదేవిధంగా స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ఎంఈవో శ్రీనివాస్ పరీక్షా సామగ్రిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో శాగం లింగారెడ్డి, శాగం శ్రవణ్‌కుమార్‌రెడ్డి, పగడాల సైదులు, లింగారెడ్డి, వీరారెడ్డి, షేక్ సుబాని, బ్రహ్మానందరెడ్డి, నాసర్‌రెడ్డి, గంగయ్య, కృష్ణ, శేఖర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, రాంరెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, షేక్ కమాల్, గాలిబ్‌సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలి

పెద్దఅడిశర్లపల్లి, మార్చి11 (ఆంధ్రజ్యోతి): నూతనంగా ఏర్పడిన తండాలను, గ్రామపంచాయతీలను రెవెన్యూ గ్రామాలుగా గుర్తించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కంబాలపల్లి ఆనంద్ డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని పావురాలగుట్టు గ్రామంలో నెలకొన్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో మౌలిక సదుపాయలు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. గ్రామాల్లో మంచినీటి సమస్య తీవ్రంగా ఉందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న పోడు భూముల హక్కు పత్రాలు ఇవ్వాలని, బ్యాంకు రుణాల సౌకర్యం కల్పించాలని, తండాల అభివృద్ధికి ప్రత్యేక నిదులు కేటాయించి అభివృద్ధి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం పోరుబాటలో వచ్చిన సమస్యలను ప్రజలను చైతన్యం చేస్తూ సమస్యల పరిష్కారానికి ఈ నెల 24న ఎమ్మార్వో కార్యాలయం ఎదుట, 25న కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి కావలి కృష్ణయ్య, కమిటీ సభ్యులు ధర్మాపురం దేవయ్య, సత్యనారాయణ, చందునాయక్ తదితరులు పాల్గొన్నారు.



పావురాలగుట్ట గ్రామంలో సమస్యలు తెలుసుకుంటున్న సీపీఎం నాయకులు

## మండలం మారినా.. బోర్డు మారలే




గుడిపల్లి పాఠశాల బోర్డుపై పీఏపల్లి మండలం పేరు

గుడిపల్లి కొత్త మండలంగా ఏర్పడి సంవత్సరన్నర అవుతున్నా గుడిపల్లి పాఠశాల బోర్డుపై పాత మండలం పేరే ఉంది. 2023 అక్టోబరు 4వ తేదీన పెద్దఅడిశర్లపల్లి మండలం నుంచి 11 గ్రామ పంచాయతీలతో మేజర్ గ్రామ పంచాయతీగా ఉన్న గుడిపల్లిని మండలంగా ఏర్పాటు చేశారు. తహసీల్దార్ కార్యాలయం, ఎంపీడీవో కార్యాలయం, ప్రత్యేకంగా ఎంఈవోను కేటాయించిన పాఠశాలల బోర్డుపై పాత మండలం పీఏపల్లి పేరే దర్శనమిస్తోంది. మండలం ఏర్పడినా బోర్డులు మార్చకపోవడంపై ప్రజలు పెదవి విరుస్తున్నారు. ● ఆంధ్రజ్యోతి, గుడిపల్లి(పెద్దఅడిశర్లపల్లి),

## మూసీ ఆయకట్టు రైతులను ఆదుకోవాలి



రావువారిగూడెం సమీపంలో ఎండుతున్న వరి పొలాలను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

వేములపల్లి, మార్చి 11(ఆంధ్రజ్యోతి): మూసీ ఎడమకాల్వ చివరి ఆయకట్టులో పంటలు ఎండిపోయి నష్టపోతున్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి పాదూరి శశిధర్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని ఆమనగల్లు, లక్ష్మీదేవిగూడెం, రావువారిగూడెం గ్రామాల పరిధిలో ఎండిపోతున్న వరి పంటలను రైతులతో కలిసి మంగళవారం పరిశీలించారు. మూసీ ఎడమకాల్వ పరిధిలో చివరి ఆయకట్టు అయిన ఈ ప్రాంతాలకు నీరు సరిగా అందకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయన్నారు. అధికారులు మాత్రం చివరి ఆయకట్టుకు నీరందేలా చర్యలు తీసుకోవడంలో పూర్తిగా విఫలమవుతున్నారన్నారు. పంట ఎండిపోయిన పొలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి ఎకరాకు రూ.20వేల నష్ట పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు రొండి శ్రీనివాస్, మండల నాయకులు పతాని శ్రీను, తంగెళ్ల నాగమణి, విష్ణు, శ్రీను, వెంకట్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, గంగయ్య, పద్మ తదితరులు పాల్గొన్నారు.

## కోర్టు తీర్పు కుల దురహంకారులకు చెంపపెట్టు

నాగార్జునసాగర్, పెద్దవూర, మార్చి11(ఆంధ్రజ్యోతి): ప్రణయ్ హత్య కేసులో కోర్టు తీర్పు కుల దురహంకారులకు చెంపపెట్టు అని కేవీపీఎస్ జిల్లా నాయకుడు దొంతాల నాగార్జున అన్నారు. నాగార్జునసాగర్, పెద్దవూరలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కులదురంహకారంతోనే ప్రణయ్ హత్య జరిగిందన్నారు. ఈ కేసులో ఒకరికి ఉరి శిక్ష, ఆరుగురికి యవజ్జీవ కారాగార శిక్ష విధించడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో కేవీపీఎస్ నాయకులు చుక్క రమేష్, రమణ, దోరెపల్లి మల్లయ్య, ఎల్లయ్య, నాగయ్య పాల్గొన్నారు.

## నాట్కో ట్రస్ట్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

తిరుమలగిరి(సాగర్), మార్చి 11(ఆంధ్రజ్యోతి): నాట్కో ట్రస్ట్, ఎల్‌వీ. ప్రసాద్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని నాయకునితండాలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ట్రస్ట్ మెడికల్ ఆఫీసర్ మురళీధర్, యూత్ కాంగ్రెస్ నాయకుడు మునినాయక్ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ క్యాంప్‌లో 142 మందికి కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కంటి అద్దాలు, మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సిబ్బంది నాగమణి, చీనా, లక్ష్మా, కాశయ్య, వస్రాం, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.